

పాలన అంటే బటన్లు నొక్కడం కాదు.. ప్రజలకు తమ కాళ్ల మీద నిలబడే శక్తిని అందించడం. చేపలు పెట్టడం కాదు.. పట్టాలన్న కార్ల్ మార్క్స్ చెప్పిన మాటల్ని చంద్రబాబు పదేపదే చెబుతారు. ఈ ప్రభుత్వం అదే విధంగా పనిచేస్తోంది. సంక్షేమాన్ని విస్మరించలేదు,సంక్షేమాన్ని ప్రారంభించిన ఎన్టీఆర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్నాం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

బుధవారం 11.03.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 323 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

ఉగాదికి 2.50 లక్షల సామూహిక గృహ ప్రవేశాలు

- రాష్ట్రంపై యుద్ధ ప్రభావం తగ్గించేలా చర్యలు
- పౌల్ట్రీ, హార్టికల్చర్ రంగాల్లో సంక్షోభం తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ
- గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రుల క్షేమ సమాచారాలపై నిరంతరం ఆరా
- సీసీ కెమెరా నెట్వర్క్ ద్వారా నేర నియంత్రణ ప్రణాళిక
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఇరాన్ యుద్ధ ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తగిన నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గల్ఫ్ దేశాలతో ఉన్న అన్ని అంశాలూ ప్రభావితం అయ్యే అవకాశం ఉంటుందని వాటి వల్ల సంక్షోభం తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మంగళవారం వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్పీజీ, గుడ్లు, అరటి వంటి వాటి ఎలాంటి ప్రభావం ఉందోననే అంశంపై నిరంతరం పరిశీలించాలని సీఎం సూచించారు. యుద్ధ ప్రభావిత దేశాలతో పాటు ఇతర ప్రాంతాల్లో తెలుగు వారు ఉన్న చోట పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. విదేశాంగ వ్యవహారాల శాఖతో సంప్రదించి ప్రవాసాంధ్రుల క్షేమంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంతో పాటు ఉన్నతాధికారులు ఓ బృందంగా ఏర్పడి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. అంతకుముందు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థలు అందిస్తున్న పౌర సేవలు, విద్యుత్ సరఫరా, పాఠశాల, ఉన్నత విద్య, ఇసుక సరఫరా లాంటి అంశాలపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత ఏడాదిలో విద్యుత్ వినియోగం గరిష్టంగా 14,013 మెగావాట్లకు చేరుకుందని అధికారులు వివరించారు. విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎనర్జీ ఆడిట్ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి డిస్కంలను ఆదేశించారు. ఈ విషయంలో వినియోగదారులకు పూర్తి సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిస్కంలకు సూచించారు. అటు పాఠశాల, కళాశాల విద్యకు సంబంధించిన అంశాల్లో సిలబస్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రమైన తరగతి గదులు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తృణ ధాన్యాలతో చిక్కీ లాంటి పౌష్టికాహారం అందించే అంశాన్ని ప్రయోగాత్మకంగా మిగతా 2లో...

తెలుగు వైభవాన్ని చాటేలా అమరావతి అభివృద్ధి

సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై దృష్టి సారించండి

క్రీడలు, పర్యాటకానికి పెద్ద పీట వేసేలా ప్రణాళికలు

పెట్టుబడులు పెట్టడానికి వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు

59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

భూ కేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు సీఆర్డీఏ అథార్టీ ఆమోదం

2లో

'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- త్వరలో టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్
- వచ్చే 10 ఏళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- గనుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు అధికారుల ప్రతిపాదన

2లో

సౌదీ టూ ఏపీ

- సౌదీ నుండి 59 మంది తిరుగు పయనం
- మంత్రి లోకేష్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఏపీఎన్ఆర్టి, ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు

బహ్రెయిన్: ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ లో చిక్కుకున్న 59మంది తెలుగు ప్రజలు ఏపీఎన్ఆర్ టి, ఎన్ఆర్ఐ టిడిపి సంయుక్త సహకారంతో మంగళవారం రాత్రి క్షేమంగా బయలు దేరారు. సౌదీ అరేబియా దమ్మాం ఎయిర్ పోర్టు నుంచి వారు విమానంలో పయనమయ్యారు. యుద్ధం కారణంగా తాత్కాలికంగా నిలిచిన విమానాల రాకపోకలు పాక్షికంగా పునఃప్రారంభమైన నేపథ్యంలో, గత 10రోజులుగా బహ్రెయిన్ తో పాటు వివిధ ప్రాంతాల్లో చిక్కుకున్న 59 మంది అక్కడ నుంచి సురక్షితంగా బయలు దేరారు.
అక్కడ చిక్కుకున్న వారి పరిస్థితి మొదట బహ్రెయిన్ లోని ఏపీ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీ), ఎన్ఆర్ఐ టీడీపీ విభాగానికి తెలిసింది. వెంటనే వారు అధికారులకు సమాచారం అందించి తక్షణ సహాయం కోరారు. మిగతా 2లో...

పుష్కరాలకు ముందే పోలవరం పూర్తికి సన్నాహాలు

- పోలవరం ఆంధ్రప్రదేశ్ ఆధునిక దేవాలయం
- నాణ్యత విషయంలో రాజీలేదు
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ఏలూరు(జర్నలిస్ట్ ఫైల్) : పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ కు ఆధునిక దేవాలయం అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు రాష్ట్రంలో చారిత్రక ఘట్టమైన గోదావరి పుష్కరాలకు ముందే, పోలవరం పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ప్రాజెక్టు పనులను, ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా.. ఇంజనీరింగ్ నిపుణులు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం పూర్తి చేయడం ద్వారా ఇటు ఉత్తరాంధ్ర అటు రాయలసీమకు గోదావరి జలాలు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయబోతున్నామని చెప్పారు. ఈ మహా యజ్ఞం ద్వారా రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా చేయడమే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయంగా ఆయన పేర్కొన్నారు. అలాగే పోలవరం సహా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామన్నారు.
ఇరిగేషన్ రంగానికి గతంలోనూ, ఇప్పుడు పెద్ద పీట వేసి, అవి పూర్తి అయ్యేలా చేసింది, చేస్తోంది కూటమి ప్రభుత్వమే.. అని ఆయన చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించి పనుల నాణ్యత విషయంలో ఎక్కడా, రాజీ పడే ప్రసక్తే ఉండకూడదని చంద్రబాబు సూచించిన విషయాన్ని రామానాయుడు గుర్తు చేశారు.
గత ప్రభుత్వంలో కీలకమైన డయాఫ్రం వాల్ ధ్వంసం అయింది. దాన్ని సరి చేస్తే సరిపోతుంది అని నిపుణులు చెప్పినా
నాణ్యత, ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే, కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. సి డబ్ల్యూ సి డిజైన్స్ ప్రకారమే పోలవరం పనులు జరుగుతున్నాయన్నారు. అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనలు, ప్రమాణాలు పాటిస్తూ పనులు చేస్తున్నామన్నారు. ఈ పనులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిత్యం పర్యవేక్షిస్తుందని..రామానాయుడు అన్నారు. అలాగే ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు కేంద్రానికి తెలియజేస్తున్నట్లు చెప్పారు.
కొత్త డయాఫ్రం వాల్ 1372 మీటర్లకు గానూ, 1300 మీటర్లు నేటికి పూర్తయిందన్నారు. ఈ నెలాఖరికి మొత్తం పూర్తవుతుందన్నారు. ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో నేలను గట్టిపరచేలా వైబ్రో కాంప్యాక్షన్ పనులు - 2లో...

వినోదం, పర్యాటక రంగాలకు ఏపీ హబ్: మంత్రి దుర్గేష్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాలు, సంస్కరణలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మహారాష్ట్రలోని ముంబయిలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్ లో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆధునిక పర్యాటక రంగంలో అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్కులు కీలకమైన స్తంభాలుగా ఎదిగిన నేపథ్యంలో కుటుంబాలు వినూత్న అనుభూతుల కోసం, యువత సాహస క్రీడల కోసం , సామాన్య పర్యాటకులు కొత్తదనం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొంటూ అమ్యూజ్‌మెంట్ రంగంలోని జాతీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, వేలాది ఉద్యోగాలను సృష్టించడం తద్వారా సమాజ జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మిగతా 2లో...

కేరళ ఎన్నికలపై బీజేపీ ఫోకస్...

అరణ్ముళలో జయప్రకాష్ వ్యూహం

- అరణ్ముళలో బీజేపీ వ్యూహాత్మక అడుగులు
- ఎన్నికల ఇన్‌చార్జ్ వల్లూరు జయప్రకాశ్ కార్యాచరణతో వేడెక్కిన రాజకీయాలు

ఎడిటర్స్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) : రానున్న కేరళం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో హవా చాటేందుకు బీజేపీ సన్నద్ధం అవుతోంది. గత దశాబ్ద కాలంగా ఎల్డీఎఫ్ కూటమి భాగస్వామ్య పార్టీ అయిన సీపీఎంకు కంచుకోటగా మారిన అరణ్ముల అసెంబ్లీ నియోజకవర్గంపై బీజేపీ ప్రధానంగా దృష్టి సారించింది. సీపీఎంకు చెందిన మంత్రి వీణ జార్జ్ గత రెండు పర్యాయాలుగా ఈ నియోజకవర్గం నుంచి శాసనసభ్యురాలిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
సాంప్రదాయంగా ఈ నియోజకవర్గంలో వామపక్ష కూటమి మరియు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మధ్య పోటీ కొనసాగుతూ వస్తోంది. గత రెండు దశాబ్దాలుగా పథనం థిట్టా జిల్లాలోని అరణ్ముల నియోజకవర్గంలో రాజకీయం సీపీఎం, కాంగ్రెస్ మధ్యే తిరిగుతోంది. ఇటువంటి నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీకి చెందిన యువ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణను బీజేపీ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఒక్కసారిగా ఈ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. సీపీఎం, కాంగ్రెస్ పార్టీల మధ్యే జరుగుతున్న ద్విముఖ పోరు కాస్త జయప్రకాశ్ నారాయణ రంగప్రవేశంతో త్రిముఖ పోరుగా మారి బీజేపీ శంఖారావం ప్రతిధ్వనిస్తూ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.
జయప్రకాశ్ రంగప్రవేశంతో త్రిముఖ పోరు : వల్లూరు జయప్రకాశ్ అరణ్ముల నియోజకవర్గానికి బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమితులైన తర్వాత అక్కడ పార్టీ కార్యకలాపాలకు కొత్త ఊపు వచ్చింది. స్థానిక రాజకీయ పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేస్తూ ఆయన పార్టీ విస్తరణకు వ్యూహాత్మకంగా పనిచేస్తున్నారు. కరుడుగట్టిన బీజేపీ వాదిగా ఆ పార్టీ జాతీయ స్థాయి సీనియర్ నేతల వద్ద రాజకీయ శిష్యరికంతో ఎన్నికల వ్యూహ రచనలను అవపాన పట్టిన జయప్రకాశ్ నారాయణలో రాజకీయ చాతుర్యంతో పాటు దూకుడుతనం మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఆ దూకుడుతనంతోనే ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటమి నేతలు ఉలికిపడేలా చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించడమే కాకుండా, అరణ్ముల నియోజకవర్గంలో ప్రధాన పోటీదారులం తామేనంటూ బీజేపీ జెండాను 8 లో..

సౌదీ టూ ఏపీ

(మొదటి పేజీ తరువాయి)
విషయం తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ భవన్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ఏపీఎన్ఆర్టి చైర్మన్ వేమూరి రవికుమార్, సీఈఓ కృష్ణమోహన్ రంగంలోకి దిగి ఆయా దేశాల్లోని గుడ్ విల్ రాయబారులను అప్రమత్తం చేశారు.

గల్ఫ్ కౌన్సిల్ ఎన్ఆర్ఐ టిడిపి విభాగ అధ్యక్షుడు రావి రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, బహ్రేన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో కూడిన ఆరు గల్ఫ్ దేశాల్లో ప్రస్తుతం సుమారు 100 మంది ఏపీఎన్ఆర్టిఎస్ గుడ్ విల్ రాయబారులు చురుకుగా పనిచేస్తున్నారు. ఈ వాలంటీర్లు ఖతార్, కువైట్, బహ్రేన్ నుంచి సౌదీ అరేబియాకు వెళ్లాల్సిన తెలుగువారికి ట్రాన్జిట్ వీసాల జారీకి సహకారం అందించారు. సౌదీ అరేబియాలోని దమ్మాం నుంచి విమానాలు ప్రస్తుతం నడుస్తున్నాయి. వారికి స్థానిక రవాణాను కూడా ఏర్పాటు చేశాం. చిక్కుకున్న ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకోవడానికి వ్యక్తిగత వాహనాలు, ఇతర లాజిస్టిక్ సపోర్ట్ అందించినట్లు రాధాకృష్ణ చెప్పారు.

తెలుగు పౌరులను సురక్షితంగా తరలించడానికి బహ్రెయిన్ టీమ్ సభ్యులు రఘునాథ్ బాబు, హరిబాబు, శివకుమార్, సతీష్ షెట్టి, మోహన్, సతీష్ బోళ్ళ, జగదీష్, బాలకృష్ణ, సౌదీ టీమ్ సభ్యులు ఖలీద్, సైఫుల్లా, జానీ షేక్, రంజిత్, ముజామిల్, జాకీర్, సారథి సహకారం అందించారు. తాము క్షేమంగా స్వస్థలాలకు వెళ్ళడానికి సహకారం అందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, ఏపీఎన్ఆర్టి టీమ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత రాయబారులు, బహ్రేన్, సౌదీ ఎన్ఆర్ఐ టిడిపి నాయకులకు సౌదీ నుంచి బయలుదేరిన తెలుగు పౌరులు కృతజ్ఞతలు తెలిపారు.

'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రాన్ని 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. ఇందుకు రాష్ట్రంలో బీచ్ సాండ్ వంటి మినరల్స్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. సచివాలయంలో మంగళవారం గనుల శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ట్రా-మావీవీ)' రూపకల్పన, పెట్టుబడులు, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ మిషన్ ద్వారా భారీగా పెట్టుబడులు ఆకట్టుకోవడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం అన్నారు. ఇది రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతంగా నిలుస్తుందన్నారు. ఈ మిషన్ ద్వారా వచ్చే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు, 40,000 ఉద్యోగాల సాధనే లక్ష్యం కావాలన్నారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్రం, మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలు, వాల్యూ ఎడిషన్ పైనా మరింత అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. వనరుల సద్వినియోగం చేసుకోవాలంటే వాటిపై అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలన్నారు.

రాష్ట్రంలో విలువైన బీచ్ సాండ్ మినరల్స్ : రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని, వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి ఖనిజాలు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బీచ్ సాండ్ మినరల్స్ ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఔషధ పరిశ్రమ, ఏరోస్పేస్, రక్షణ రంగం, శస్త్రచికిత్స, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ భాగాల వంటి కీలక పరిశ్రమలకు అవసరం అవుతాయని వివరించారు. రాష్ట్రంలో లభిస్తున్న మినరల్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ఈ సందర్భంగా ప్రతిపాదనలు ముఖ్యమంత్రి ముందుంచారు. అందులో ఒకటి శ్రీకాకుళంలో టైటానియం పార్క్, సంవత్సరానికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం. రెండవది అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్, సంవత్సరానికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం. మూడవది మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్. ఈ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర, మైనింగ్, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పుష్కరాలకు ముందే పోలవరం పూర్తికి సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)
పూర్తి చేశామని చెప్పారు.ప్రాజెక్ట్ అనుసంధాన పనుల్లో ముఖ్యమైన కుడి, ఎడమ కాలువలను ఈ ఏడాది జూన్ కల్లా పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు.

నిర్వాసితుల నష్టపరిహారానికి సంబంధించి నాడు 2016లో రూ.700 కోట్ల పరిహారం అందించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. మరలా కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు దఫాలుగా 1900 కోట్లు పంపిణీ చేసి నిర్వాసితులకు అండగా నిలిచారన్నారు. నిర్వాసితులను కొంత మంది మధ్యవర్తులు మీకు మావల్లే పరిహారం అందింది అంటూ మోసం చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చిందని, మధ్యవర్తుల విషయం లో అధికారులు కఠినం గా వ్యవహరించాలని సూచించారు. నిర్వాసితులు కూడా ఇలా మోసానికి పాల్పడే వారిపట్ల జాగ్రత్త గా ఉండాలని సూచించారు.

ప్రాజెక్ట్ నిర్మాణం పై సూచనలు, సలహాలు, విమర్శలు, డిమాండ్స్ వస్తున్నా, వాటిని మనస్ఫూర్తిగా స్వీకరిస్తామని మంత్రి రామానాయుడు చెప్పారు. ప్రాజెక్ట్ నిర్మాణ నాణ్యత పై గాని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన నొక్కి వక్కాణించారు. మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈ ఎన్ సి నరసింహ మూర్తి, ప్రాజెక్ట్ అడ్మిన్ అభిషేక్, మరియు కాంట్రాక్టు ఏజెన్సీ ల ప్రతినిధులు, ఇతర ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

ఉగాదికి 2.50 లక్షల సామూహిక గృహ ప్రవేశాలు

(మొదటి పేజీ తరువాయి)
చేపట్టాలని అధికారులకు సూచించారు.



డీజీసీఏ సహకారంతో డ్రోన్ పైలట్ ట్రైనింగ్ సెంటర్ : ఉగాది రోజున 2.50 లక్షల మంది లబ్ధిదారుల సామూహిక నూతన గృహ ప్రవేశ కార్యక్రమం చేపడుతున్నామని, వారికి ప్రభుత్వం తరపు నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు అందించేలా అధికారిక లేఖ వెళ్లేలా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఇసుక సరఫరా జరగాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సీఎం సూచించారు. ఇటీవల ఢిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ ఇండియా సమ్మిట్లో కుదుర్చుకున్న ఒప్పందాలు సాకారం అయ్యేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు భారత్ జెన్, నెక్స్ జెన్, ఐబీఎం లాంటి సంస్థలు ముందుకు వచ్చాయని వచ్చే విద్యా సంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలని సీఎం అన్నారు. అటు కాలిబో సంస్థ ఏర్పాటు చేయదలచిన ఏఐ శాండ్ బాక్స్ వచ్చే నాలుగు నెలల్లో స్టార్టప్ ల కోసం అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఎన్విడియా సంస్థ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో భాగసామ్యం వహించేలా చూడాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ రైతుకూ సహకారం అందించేలా ఏఐ ఆగ్రానమిస్ట్, విద్యా బోధనకు సహకారం అందించేలా ఏఐ ట్యూటర్, ప్రాథమికంగా వైద్య సలహాలు అందించేలా ఏఐ డాక్టర్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పేషెంట్ ప్రిస్క్రిప్షన్ కూడా యాప్ ద్వారా వచ్చేలా చూడాలన్నారు. సీసీ టీవీ యాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 14 వేల సీసీ కెమెరాలను అనుసంధానించి నేర నియంత్రణ చేపట్టేలా చూడాలన్నారు. నేరస్థులను గుర్తించి నేరాలకు అడ్డుకట్టే వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీని త్వరితగతిన అందుబాటులోకి తేవటంతో పాటు డ్రోన్ ఫ్లైయింగ్ ట్రాక్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రిమోట్ పైలట్ ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సహకారంతో అత్యుత్తమ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏటీసీ తరహాలోనే డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థను కూడా రూపొందించాలన్నారు. వాట్సప్ గవర్నెన్సు వినియోగం మరింత పెంచేలా పౌరులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, ఐటీ, ఆర్టీజీఎస్, గనులు, విద్య, ఆర్థిక, ప్రణాళిక శాఖల అధికారులు హాజరయ్యారు.

తెలుగు వైభవాన్ని చాటేలా అమరావతి అభివృద్ధి



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా... భావితరాలకు అందించేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధానిలోని వివిధ సంస్థలకు జరపాల్సిన భూ కేటాయింపులు, సెక్రటేరియేట్, హెచ్వోడీ భవనాల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సీఆర్డీఏ నుంచి వచ్చిన వివిధ ప్రతిపాదనలను సీఆర్డీఏ అథార్టీ సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...'రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి. మొత్తంగా 167 ఎకరాల విస్తీర్ణంలో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు తెలుగు వైభవాన్ని చాటేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్ తదితర విభాగాలు వస్తాయి. పర్యాటకంతో పాటు నిత్యం రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకునే వాతావరణం ఉండేలా చూడాలి. హోటళ్లను ఏర్పాటు చేయాలి... అమ్యూజ్మెంట్ పార్కులను అభివృద్ధి చేయాలి. అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా ఆ ప్రాంతాన్ని డిజైన్ చేయాలి. నీరుకొండలో చేపట్టే బోయే ప్రాజెక్టును అత్యంత సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలి. భవిష్యత్తులో క్రీడా రంగం అతి పెద్ద ఆదాయ వనరు కాబోతోంది. దీనికి బీసీసీఐ, ఐసీసీ సంస్థలే అతి పెద్ద ఉదాహరణ. ఒకప్పుడు నిధుల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి ఇప్పుడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా క్రికెట్ బోర్డులు ఎదిగాయి. ఇదే విధంగా మరికొన్ని క్రీడలు కూడా కమర్షియలుగా టర్న్ అవుతాయి. ఇలాంటి వాటిని అందిపుచ్చుకోవాలి. అమరావతిలోని స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇదే విధంగా రూపొందించాం. అమరావతిలోకి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను తీసుకురావాలి. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇలాంటి వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు చింతిస్తున్నాయి. ఈసారి అమరావతిలో అలాంటి అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న క్రెడిబులిటీ. ఈ బ్రాండ్ మరింతగా పెరగాలి. అందుకే పెట్టుబడులు పెట్టే వారిని రెగ్యులరుగా ఫాలో అప్ చేస్తూనే ఉండాలి. ఓవైపు రాజధానిలో పనులను త్వరితగతిన చేపట్టేలా పర్యవేక్షణ చేస్తూనే.. పెట్టుబడులు పెట్టే సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. అమరావతిలో నిర్మించబోతున్న తెలుగు కల్చరల్ సెంటర్ కు మంచి పేరును పరిశీలించండి. రాజధానిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయండి. ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఓ పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించాల్సిన అవసరం ఉంది"అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

59వ సీఆర్డీఏ అథార్టీ ఆమోదం పొందిన **అంశాలివే..:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయింపు

పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు కేటాయింపు

పంచాయితీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయింపు

ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2316 కోట్లకు పరిపాలనా అనుమతులు.

రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం

వినోదం, పర్యాటక రంగాలకు ఏపీ హబ్: మంత్రి దుర్గేష్

(మొదటి పేజీ తరువాయి)
పర్యాటక రంగంలో ఇన్వెస్టర్లకు అందిస్తున్న రాయితీలను తెలుపుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. మంత్రి దుర్గేష్ స్పీచ్ పై ఇన్వెస్టర్లు హర్షం వ్యక్తం చేశారు. ముందుగా ఎక్స్‌పోను ప్రారంభించిన మంత్రి దుర్గేష్ స్టాళ్లను పరిశీలించి ఏపీ పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు.పలు స్టాళ్ల వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన వినోద సాధనాలను పరిశీలించారు. కార్యక్రమం అనంతరం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అంకూర్ మహేశ్వరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా: సుదీర్ఘ తీరప్రాంతం, గొప్ప సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యమైన ప్రకృతి దృశ్యాలు కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించిందని, నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు 25 శాతం వరకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ,పారిశ్రామిక ధరలకే విద్యుత్ సరఫరా,ఎలక్ట్రిసిటీ డ్యూటీ రీయింబర్స్‌మెంట్,100 శాతం నెట్ ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్,ఉపాధి కల్పన ఆధారిత సబ్సిడీలు తదితర భారీ రాయితీలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక భూ కేటాయింపు విధానం: హోటళ్లు, థీమ్ పార్కులు, రిసార్టుల కోసం భూ కేటాయింపు ప్రక్రియను సరళతరం చేస్తూ 'టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025'ను దేశంలోనే మొదటిసారిగా ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మంత్రి దుర్గేష్ వివరించారు. రూ. 50 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టే ప్రాజెక్టులకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా నేరుగా భూ కేటాయింపులు జరుగుతాయని స్పష్టం చేశారు.

స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047:సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దార్శనికతతో 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'ని రూపొందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. దీని ద్వారా ఏపీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. గత ఏడాది కాలంలోనే 102 ఒప్పందాల ద్వారా రూ. 18,448 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని ఆయన వెల్లడించారు. అదనంగా, స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా రూ. 9,446 కోట్ల పెట్టుబడితో 7,348 క్లాసిఫైడ్ హోటల్ గదుల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. పర్యాటక రాయితీలను పొందడంలో పారదర్శకత, వేగం, ఎటువంటి ఇబ్బందులు లేని ప్రక్రియను నిర్ధారించడానికి పర్యాటక విధానానికి సంబంధించిన 'ఆపరేషనల్ గైడ్‌లైన్స్' విడుదల చేసినట్లు వివరించారు.రాష్ట్రంలో పర్యాటక అనుభవాలను విస్తృతం చేయడానికి కారవాన్ టూరిజం ప్రమోషన్, హోమ్‌స్టే, బి అండ్ బి పాలసీ 2025లను తెచ్చామన్నారు. త్వరలోనే కాన్సర్ట్ పాలసీ, ఏపీ ఫిల్మ్ టూరిజం పాలసీ, మైస్ పాలసీలను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఇవి పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా స్థానికులకు ఉపాధిని కల్పిస్తున్నాయన్నారు.

మెగా పెట్టుబడులకు మూడు ప్రధాన నగరాలు..ఆంధ్రప్రదేశ్ - అవకాశాల గని:అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కులు, వాటర్ ఫ్రంట్ అట్రాక్షన్స్, అడ్వెంచర్ జోన్లు, సమగ్ర వినోద కేంద్రాల ఏర్పాటుకు ఏపీలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, తీరప్రాంత సర్క్యూట్లు, ఆధ్యాత్మిక పట్టణాలు, అటవీ ప్రాంతాలు, పట్టణ వినోద కారిడార్లలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వాటర్ రిక్రియేషన్, ఫిల్మ్ థీమ్ పార్కులు, అడ్వెంచర్ స్పోర్ట్స్ హబ్‌లకు ఇక్కడ అధిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో అమ్యూజ్‌మెంట్,థీమ్ పార్కుల కోసం మూడు కీలక నగరాలను ప్రతిపాదించారు. గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతి నూతన ఆవిష్కరణలకు అద్భుతమైన వేదిక అని, విశాఖపట్నంను అంతర్జాతీయ స్థాయి తీరప్రాంత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని, భారీ సంఖ్యలో వచ్చే భక్తుల దృష్ట్యా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తిరుపతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పర్యాటక, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులతో సమానంగా ఈ రంగానికి కూడా ప్రాముఖ్యతనిస్తూ ఒక అనుకూలమైన వ్యవస్థను నిర్మిస్తున్నామని భరోసానిచ్చారు. అంతర్జాతీయ స్థాయి వినోద కేంద్రాల నిర్మాణంలో ఇన్వెస్టర్లకు ఎదురయ్యే అడ్డంకులను తొలగించి, అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తున్నామని వివరించారు.

టైర్-2, టైర్-3 నగరాల్లో చిన్న తరహా పార్కులు: రాష్ట్రంలోని చిన్న నగరాల్లో కూడా వినోద అవసరాలు పెరుగుతున్నాయని, అక్కడ చిన్న తరహా అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో త్వరితగతిన రాబడిపొందవచ్చని ఇన్వెస్టర్లకు మంత్రి దుర్గేష్ సూచించారు.

ఆంధ్రప్రదేశ్ కేవలం పర్యాటక ప్రదేశమే కాదు.. పెట్టుబడిదారుల కలల రాష్ట్రం: భారతదేశంలో వినోద రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించడం ఐఏఏపీఐ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేష్ అన్నారు. వీరితో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.గత కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలోని అమ్యూజ్‌మెంట్ పార్కులు, థీమ్ పార్కులు, వాటర్ పార్కులు, ఇండోర్ అమ్యూజ్‌మెంట్ సెంటర్ల ప్రయోజనాలకు, భద్రతా ప్రమాణాలు, వృత్తిపరమైన శిక్షణ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు , ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ప్రాతినిధ్యం వహించే ఒక అగ్రగామి సంస్థగా కొనియాడారు. IAAPI వంటి అనుభవజ్ఞులైన సంస్థల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి థీమ్ పార్కులను ఏర్పాటు చేసి, పర్యాటకులకు మర్చిపోలేని అనుభూతులను అందించాలని కోరుకుంటున్నానన్నారు.ఆంధ్రప్రదేశ్ కేవలం పర్యాటక ప్రదేశమే కాదు.. పెట్టుబడిదారుల కలల రాష్ట్రమని, అమ్యూజ్‌మెంట్ పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి కొత్త శోభను, యువతకు ఉపాధిని తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయమన్నారు. మాకు కేంద్ర సహకారం మెండుగా ఉందని తెలిపారు..సృజనాత్మకతకు, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమైన ఐఏఏపీఐ ఎక్స్‌పోలో పాల్గొనడం సంతోషంగా ఉందన్న మంత్రి దుర్గేష్ వినోద రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఏపీలో వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు, పర్యాటక భవిష్యత్తు నిర్మాణానికి భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వ ప్రధాన దృష్టి ఆధునికమైన, సుస్థిరమైన,సురక్షితమైన గమ్యస్థానాలను నిర్మించడంపై ఉందని, వినూత్న ఆలోచనలు, అత్యాధునిక సాంకేతికతతో వచ్చే భాగస్వామ్యాలను ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ ఆహ్వానిస్తుందన్నారు..అదే విధంగా మెగా పార్కుల నుండి చిన్న తరహా పార్కుల వరకు అపారమైన సామర్థ్యాన్ని వెలికితీయడానికి పరిశ్రమల అధిపతులు, డెవలపర్లు, పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అందిస్తున్న అద్భుత అవకాశాలను పరిశీలించాలని, తమతో భాగస్వాములు కావాలని సాదరంగా ఆహ్వానిస్తూ రండి, రేపటి సంతోషాన్ని నేడే కలిసి నిర్మిద్దామని ప్రసంగాన్ని ముగించారు.

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అంకూర్ మహేశ్వరి మాట్లాడుతూ భారతదేశంలో అమ్యూజ్‌మెంట్ రంగం ఏటా 15 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని, 2030 నాటికి ఈ రంగం రూ.25,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామన్నారు.. ప్రస్తుతం భారత దేశంలో సుమారు 300 అమ్యూజ్‌మెంట్ పార్కులు, 2,500 ఇండోర్ సెంటర్లు ఉండటం ఈ రంగంపై ప్రజలకు ఉన్న ఆసక్తిని తెలియజేస్తోందని వివరించారు. ఏపీ పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ఈ ఎక్స్ పోను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.ఏపీలో ఈ రంగంలో విస్తృత పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ రఫీక్, సీనియర్ కన్సల్టెంట్లు సత్యప్రభ, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వినిపించారు.

ముఖ్యంగా ఇళ్ల స్థలాల కేటాయింపులు, టిడ్కో ఇళ్ల పంపిణీ మరియు నిర్మాణ సమస్యలు, అలాగే తమ నివాస ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమగ్రంగా వివరించిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రతి సమస్యను విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత, గృహ సమస్యల పరిష్కారం మరియు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.

మహిళల సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యాల్లో ఒకటని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని, పార్టీ కార్యాలయం ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత

ఉండవల్లి(జర్నలిస్ట్ ఫైల్) : పేదల సాధికారతకు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పీ-4 కార్యక్రమానికి నెల్లూరు జిల్లా బోగోలుకు చెందిన అమరా ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించనుంది. ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసిన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణ కుమార్ దంపతులు.. బోగోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.5 కోట్ల సాయం ప్రకటించారు. త్వరలో చేపట్టనున్న ఆయా అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా మన బడి-మన భవిష్యత్ కింద బోగోలు మండలంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపర్చనున్నారు. మన బడి-మన భవిష్యత్తు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రవాస భారతీయులు, పూర్వవిద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది. దాతల పేర్లు కూడా ఆయా పాఠశాలలకు పెట్టుకునే అవకాశం కల్పించనుంది. త్వరలోనే మన బడి - మన భవిష్యత్తు వెబ్ సైట్ ను ప్రారంభించనుంది.

మరోవైపు బోగోలు మండలం కొవ్వూరుపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.5 కోట్లు, కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.5 కోట్ల సాయాన్ని అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ అందించనుంది.

వేసవి కార్యాచరణకు సిద్ధంగా ఉన్నాం

❍ ప్రభుత్వానికి వివరించిన కలెక్టర్

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):జిల్లాలో వేసవి కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. వేసవి ముందస్తు చర్యలపై రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్ లు, గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, రెవెన్యూ, విద్య, పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ, అగ్నిమాపక శాఖ తదితర శాఖలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల కార్యాలయాలు, జనకూడలి ప్రదేశాల్లోనూ, ఇతర అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రియాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడే గ్రామాలు గుర్తించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, అటువంటి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. బోర్లను 24 గంటలలో మరమ్మతులు పూర్తి చేయుటకు అవసరమైన విడి పరికరాలు సిద్ధంగా పెట్టుటకు ఏర్పాట్లు చేసామని వివరించారు. వడ దెబ్బకు గురి కాకూడదని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరుగుతోందని చెప్పారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పనులు ఉంటే మినహా ఎవరు బయటకు రావద్దని విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తగలని సూచిస్తున్నామని చెప్పారు. చిన్నారులు, వయసు మీరినవారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు చూడాలని సూచిస్తున్నట్లు చెప్పారు. కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ చలివేంద్రియాలు అవసరమగు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి తీవ్రత వలన మనుషులు గాని, పశువులు గానీ మృత్యువాత పడకుండా ఉండటమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 1070 టోల్ ఫ్రీ నంబర్ కు ప్రజలు ఫోన్ చేయవచ్చని చెప్పారు. పర్యాటక ప్రదేశాలు, రద్దీ ఉండే దేవాలయాల వద్ద, హాట్ స్పాట్ లుగా గుర్తించిన ప్రదేశాల్లో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు పర్యవేక్షణ పక్కాగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తరాదని స్పష్టం చేశారు. వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమగు మందులు, ఓ.ఆర్.ఎస్ పాకెట్స్ సిద్ధంగా ఉంచాలని చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, విపత్తుల నిర్వహణ జిల్లా మేనేజర్ లక్ష్మీ కుమారి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో కేంద్ర బృందం పర్యటన

❍ ర్యాగ్ ఫికర్స్ పై అభిప్రాయ సేకరణ

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):ర్యాగ్ పికర్స్ కి ఆర్థికంగా అండగా నిలవడంలో గుంటూరు నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని, దేశ ప్రధాని నరేంద్ర మోడీకి అందించే వీడియో రిపోర్ట్ కోసం కేంద్ర బృందం మంగళవారం నగరంలోని బొంగరాలబీడు, బాలాజీ నగర్ ప్రాంతాల్లోని ర్యాగ్ పికర్స్ అనుభవాలు, అభిప్రాయాలని రికార్డ్ చేసిందని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ర్యాగ్ పికర్స్ ని కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారిత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవెలప్మెంట్ కార్పోరేషన్ (ఎన్ఎస్కేఎఫ్డీసి) నమస్తే పథకంలో భాగమైన స్వచ్ఛత ఉద్యమి యోజన పథకం లబ్దిదారుల విజయగాథలను ఎన్ఎస్కేఎఫ్డీసి నోడల్ అధికారులు నమోదు చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా రాజస్థాన్, తెలంగాణలో వరంగల్, తమిళనాడులోని తిరుచానూరు, ఆంధ్రప్రదేశ్ లో గుంటూరు నగరపాలక సంస్థలోనే రికార్డింగ్ జరుగుతుందన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 51 మంది ర్యాగ్ పికర్స్ ని గుర్తించి ఎన్ఎస్కేఎఫ్డీసి ద్వారా బ్యాంక్ సబ్సిడీపై వాహనాలు ఇచ్చారని, వాటి నెలవారీ ఇన్స్టాల్మెంట్ ని జిఎంసి నుండే చెల్లించి, వారికి ఆదాయం కోసం అద్దె రూపంలో కొంత చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. గుంటూరు నగరపాలక సంస్థలో ర్యాగ్ పికర్స్ ఆదాయ పెంపు చర్యలపట్ల గతంలోనే ప్రధాని సంతృప్తి వ్యక్తం చేస్తూ, ముత్తమ్మ అనే ర్యాగ్ పికర్ తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడడం జరిగిందన్నారు. ఈ ఏడాది ప్రధానికి అందించే వీడియోలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ర్యాగ్ పికర్స్ అభిప్రాయాలను తీసుకున్నారని తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఆర్థిక సహాయం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్‌కు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.99,000 ఆర్థిక సహాయం అందజేశారు.

గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ 2915 షేక్ నజీక్ ఫిబ్రవరి 13న అసెంబ్లీ సమావేశాల బందోబస్తు విధులు పూర్తి చేసుకుని గుంటూరులోని తన నివాసానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీస్ శాఖ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.99,000 ఆర్థిక సహాయాన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ కుమారుడు షేక్ నౌషాద్ అహ్మద్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన పోలీస్ సిబ్బందికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఎస్పీ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చికిత్సకు సంబంధించి ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు జిల్లా పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి

- వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలి
- న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్
- అన్ని వర్గాల వారిని అభివృద్ధిలోకి తీసుకొని వస్తున్నాం...
- పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్

కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్) : వృత్తి నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని,వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలని, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ అన్నారు.

మంగళవారం కర్నూలులో ఉస్మానియా కాలేజీ దగ్గర టీ జి వెంకటేష్ షాది ఖానా హాల్లో జరిగిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డ్ దగ్గర ఖరీదైన భూములు ఉన్నాయని పట్టింపులకు తగాదాలకు పోకుండా వాటిని సద్వినియోగం చేసుకొని ముస్లిం మైనారిటీలు లబ్ధి పొందాలని కోరారు. గతంలో కర్నూలు జిల్లాకు నేను మంత్రి గా ఉన్నప్పుడు కేఈ కృష్ణమూర్తి కూడా మంత్రిగా ఉన్నారు అయ్యపు రెడ్డి పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో ఈద్ గా కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాము , హజీరా ఉమెన్స్ కాలేజ్ ను ఏర్పాటు చేశాం , ఆంధ్ర ప్రదేశ్ లో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం , హైదరాబాద్ లో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం , మఖాన్ - దుకాణ్ స్కీమ్ తీసుకుని వచ్చాం, కర్నూలుకు ఉర్దూ అకాడమీ ని తీసుకుని వచ్చాం , ముత్తవల్లిలకు , మౌజర్లకు గౌరవ వేతనం ఇస్తున్నామని , గతం లో కార్పొరేషన్ ద్వారా లక్షల్లో లోన్లు ఇప్పించాం గత ఐదు సంవత్సరాలు మాత్రం ఏమీ జరగలేదు అని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్కిల్ కాంప్లెక్స్ కట్టాం కంప్యూటర్లు ఏర్పాటు చేశాం డెవలప్మెంట్ కు ప్రోత్సహిస్తున్నాము అని మీకున్న నైపుణ్యాన్ని ఇంకా మెరుగుపరుచుకొని అభివృద్ధిలోకి రావాలని తెలిపారు . ఇపుడు మీకు కార్పోరేషన్ అందిస్తున్న 141 (ఒకటి రూ6,400/- లు) కుట్టు మిషన్లతో మీ కుటుంబాలను వృద్ధి లోకి తీసుకొని రావాలని , కొత్తగా ఆలోచించి నైపుణ్యం పెంచుకొని మంచి పనులు చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని మహిళలను కోరారు. మీ నైపుణ్యాలను ఇంకా పెంచుకోవాలని మీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని వారిని కోరారు.

ఈ సందర్భంగా పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ మాట్లాడుతూ... జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వక్ఫ్ కమిటీ ఏర్పాటు చేయకుండా ఉండిపోయారని దానివల్ల ముస్లిం మైనారిటీలకు నష్టం జరిగిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 141 (ఒకటి రూ6,400/- లు) ఉషా కంపెనీ బ్రాండెడ్ కుట్టు మిషన్ల పంపిణీ లాంటి అభివృద్ధి పనులు జరుగుతున్నవి అని మంత్రి తెలిపారు. ఈ మిషన్లను సద్వినియోగం చేసుకొని ముస్లిం సోదరీమణులు అభివృద్ధిలోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ పనులు పూర్తి చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మా సొంత నిధులు కేటాయించి కూడా పనులు చేస్తున్నామని , కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ మరియు కిడ్స్ వరల్డ్ పార్క్ ద్వారా వచ్చే దాదాపు 50 లక్షల రూపాయల ఆదాయాన్ని ముస్లిం మైనారిటీల కొరకు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. స్థానిక బుధవారిపేటలోని దాదాపు 5 ఎకరాల స్థలాన్ని ఎం ఎస్ ఎం ఈ కి కేటాయించినట్లయితే అక్కడ చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించగలమని దీనివల్ల వక్ఫ్ బోర్డు కూడా ఆదాయం వస్తుందని , ఈ సమస్యపై సరైన చర్యలు తీసుకోవలసిందిగా మంత్రి ఫరూక్ ను కోరారు. కర్నూలు అసెంబ్లీ పరిధిలో ఏవైనా మసీదు కమిటీలు , షాదీ ఖానా కమిటీలు , కాంప్లెక్స్ కమిటీలు సరిగా పని చేయకపోయినా నిస్తేజంగా ఉన్న వివరాలు తెలిపినట్లైతే వాటిని సరైన దారిలో పెట్టి ముస్లిం మైనారిటీలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. మా తండ్రిగారు కట్టించిన ఈ టీజీవి షాదీఖానా ను నాలుగు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంచారని మేము అన్ని మతాలను , అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తామని , ఆదరిస్తామని , గౌరవిస్తామని అందుకే అందరికీ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తున్నామని , కావున మమ్మల్ని ఆదరించాలని మాకు అండగా ఉండాలని ఈ సమావేశంలో కోరారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ... కొత్తగా వస్తున్న విద్యా విధానాన్ని , విద్యను ముస్లింలు అభ్యసించాలని అప్పుడే వారి అభివృద్ధి సాధ్యమని , ముస్లింల అభివృద్ధే దేశాభివృద్ధి అని తెలిపారు. గత 20 సంవత్సరాల నుండి చాలా అభివృద్ధి జరుగుతూ ఉన్నదని దాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. దాదాపు 3 లక్షల మంది కర్నూలు జిల్లాలో ముస్లింలు ఉన్నారని ప్రతి ఒక్కరూ మంచి విద్యను అభ్యసించి అభివృద్ధిలోకి రావాలని , నర్సింగ్ కోర్సులలో ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ సమావేశానికి క్రిస్టియన్ కార్పొరేషన్ ఎం.డి ఏ.శేఖర్ , జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహ పర్వీన్ , హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీ ఖాన్ , మైనారిటీ నాయకులు మహమ్మద్ ఖాన్ , మహబూబ్ ఖాన్ , జియావుల్ హక్ , జుబేర్ , సల్మాన్ , ఇమ్రాన్ , ఇన్చార్జులు వెంకటేష్ ,శుక్రన్ లు పాల్గొన్నారు.

మహిళల సాధికారతకు ప్రధాని మోదీ ప్రత్యేక కృషి

- బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషీధా రాజు

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : మహిళల సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వమేనని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషీధా రాజు పేర్కొన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సభకు మహిళా మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు పద్మజ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా నిషీధా రాజు మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు ఆదికాలం నుంచే ప్రత్యేక గౌరవం ఉందన్నారు. ఒక మహిళ శక్తివంతంగా ఉంటే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలపడితే దేశ నిర్మాణం మరింత బలపడుతుందని తెలిపారు. మహిళల ఆరోగ్యం, శారీరక-మానసిక దృఢత్వంపై దృష్టి సారిస్తూ రాష్ట్రంలో "స్త్రీ శక్తి పంచకం" నినాదంతో మహిళా దినోత్సవ కార్యక్రమాలను 26 జిల్లాల్లో నిర్వహించినట్లు వివరించారు.

మహిళల ఆరోగ్యం, పోషణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గర్భ సంస్కారం, ఆరోగ్యకర జీవన విధానం ద్వారా భవిష్యత్ తరాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు.

ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళలకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ సుందర్ రాజ్ పెరుమాళ్ మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడం ఎంతో అవసరమన్నారు. ఆయుర్వేదం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. విలువలతో కూడిన జీవన విధానం, సరైన ఆహారపు అలవాట్లు మహిళలను మరింత బలపరుస్తాయని చెప్పారు. తల్లి తొలి గురువు అనే భావన భారతీయ సంస్కృతిలో ఎంతో గొప్పదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిగురుపాటి లక్ష్మి, డాక్టర్ సాహితి, డాక్టర్ శ్రీబాలా, రాష్ట్ర అధికార ప్రతినిధులు గాయిత్రి, యామిని శర్మ తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం

- ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- రాజకీయాలకు అతీ తంగా సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం
- మంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

నిమ్మాడ (జర్నలిస్ట్ ఫైల్) : రాజకీయాలకు అతీతంగా ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా పేద వర్గాలను కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వివిధ అనారోగ్య కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు

9 మంది లబ్ధిదారులకు రూ, ఏడు లక్షల 50 వేలు లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గం లో ఏ ఒక్కరు వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఆశయంతో నా వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుంది అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులు ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్యసహాయం అందజేయడం జరుగతుందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధి దారులు వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన మంత్రి వర్యులకు బాధితులు ప్రత్యేక కృ తజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు అజయ్ కుమార్, బాలకృష్ణ, తదితరులు ఉన్నారు. వైద్య సహాయం పొందిన రోగుల ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసు కున్న మంత్రి వర్యులు,

లబ్ధిదారుల వివరాలు : బి,వరదరాజు, 77,090, మండలం కోటబొమ్మాళి, చిన్నసాన, పి.మల్లేశ్వరరావు, కోటబొమ్మాళి మండలం, రూ, 51.245, కె.అప్పారావు, కోటబొమ్మాళి, పట్టుపురం,రూ,32,551, టి,సింహబాలుడు, కోటబొమ్మాళి, తాటిపత్రి,నీటవేణ. నందిగాం మండలం కోత్తపేట, 41,729. ఎన్. శ్రీరాములు, సంతబోమ్మాళి వడ్డివాడ, రూ, 31,843,కె.సర్వతి, పుక్కలవానిపేట, రూ, 60,848, ఎల్,శ్రీనివాసరావు, వద్దవాడ, సంతబొమ్మాళి,బృందావనం ,1,12,141, చెక్కులు అందజేశారు.

అంబేద్కర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులపై మంత్రి డిఎస్ బీవీ స్వామి ప్రత్యేక శ్రద్ధ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : అంబేద్కర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులపై మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులతో వరుస వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించి టీచర్, సొంత పేరెంట్ లా మంత్రి విద్యార్థులకు ధైర్యం చెప్పి పలు సూచనలు చేస్తున్నారు. మంగళవారం తాడేపల్లి AP SWREIS కార్యాలయంలో అంబేద్కర్ గురుకులాల 10 వ తరగతి విద్యార్థులతో మంత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. 100 శాతం విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలని, కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు కొద్దిపాటి అనారోగ్యానికి గురైనా నిర్లక్ష్యం చేయకుండా వైద్యం అందించాలన్నారు. విద్యార్థులను బస్సులో పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లి తిరిగి హాస్టళ్లకు చేర్చే వరకు పర్యవేక్షించాలన్నారు. పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు.

పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

AP SWREIS కార్యదర్శి IAS వి. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ... విద్యార్థులు ఆందోళన లేకుండా ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. పాత ప్రశ్న పత్రాలు ప్రాక్టీస్ చేయడంతో పాటు గుర్తుండేలా నోట్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తాను 10 తరగతి పరీక్షలు రాసిన అనుభవాన్ని విద్యార్థులతో ఆయన పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో AP SWREIS అదనపు కార్యదర్శి రాజ్యలక్ష్మి, జాయింట్ సెక్రటరీ రూపావతి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లాలో ప్రారంభమైన హెచ్.పి.వి వాక్సినేషన్

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు జిల్లాలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్.పి.వి) వాక్సినేషన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభం అయింది. గుంటూరు పట్టణం పట్టాభి గార్డెన్స్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15వ ఏట అడుగుపెట్టిన బాలికలకు వాక్సినేషన్ వేయడం జరుగుతుందని అన్నారు. మహిళలకు గర్భాశయ ముఖక్యాన్సర్ (సెర్వికల్ క్యాన్సర్) దేశంలో ప్రధాన శత్రువుగా ఉందన్నారు. దానిని నివారించుటకు ఫిబ్రవరి 28న ప్రధాని నరేంద్ర మోడీ అజ్మీర్ లో వాక్సినేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టారని, అదే రోజు విజయనగరంలో ముఖ్యమంత్రి ప్రారంభించారని వివరించారు. 90 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 83 కోల్డ్ చైన్ పాయింట్స్ ఉన్న పి.హెచ్.సీలు, సి.హెచ్.సిలు తదితర ఆసుపత్రుల వద్ద పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఒక్క వ్యాక్సిన్ ఖరీదు రూ.4 వేలు అని, అయినప్పటికీ ఆరోగ్యమే మహా భాగంగా ప్రభుత్వం అర్హులైన బాలికలకు అందించుటకు ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 14,167 మంది బాలికలు ఉన్నట్లు అంచనా అని, 21,170 డోసులు అవసరమని అంచనా వేశారని ఇప్పటి వరకు 6,793 డోసులు జిల్లాకు అందాయని తెలిపారు. గర్భాశయ ముఖక్యాన్సర్ నివారణ లక్ష్యంగా అందరూ అంకితభావంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు.

వాక్సినేషన్ తీసుకున్న బాలికలకు వారి స్నేహితులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి మాట్లాడుతూ 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు (14వ పుట్టినరోజు పూర్తి చేసి, 15వ పుట్టినరోజు ఇంకా జరుపుకోని వారు) అర్హులన్నారు. మధ్యస్థ లేదా తీవ్రమైన అనారోగ్యం ఉన్న బాలికలు, పూర్తిగా కోలుకున్న తర్వాత మాత్రమే టీకా ఇవ్వాలన్నారు. మునుపటి టీకాకు అలర్జీ వచ్చిన వారు లేదా ఈస్ట్ అలర్జీ ఉన్నవారు, గర్భిణీలు తీసుకోరాదని చెప్పారు. వీరి టీకా వివరాలు యు డబ్ల్యూ ఐ ఎన్ పోర్టల్‌లో అప్ లోడ్ చేయాలని అన్నారు. టీకా తీసుకునే బాలికలు ఆహారం తీసుకుని ఉండాలని,

ఖాళీ కడుపుతో ఉండకూడదన్నారు. పిల్లలు ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత మాత్రమే తల్లిదండ్రులు టీకా కేంద్రానికి పంపాలని సూచించారు. టీకా తీసుకున్న బాలికలు కనీసం 30 నిమిషాలు అక్కడే ఉండాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్ బాబు, డి.పి.ఎం.ఓ సుజాత, తహసిల్దార్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుకుల పాఠశాలలో
మహిళా దినోత్సవ వేడుకలు

బంగారుపాళ్యం, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో సోమవారం జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గ్రేడ్స్ స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ శేషాద్రి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయినిలు,వంట వారికి పసుపు కుంకుమతో నలుగు పెట్టి సన్మానించారు.ఈ కార్యక్రంలో డాక్టర్ శేషాద్రి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో మహిళలు రాణించాలని వారికి మెమెంటో ఇచ్చి 13 మందిని మహిళ సిబ్బందిని సన్మానించడం జరిగింది. ఈకార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ మా స్కూల్ టీచర్స్ ను గ్రేడ్స్ సంస్థ డాక్టర్ శేషాద్రి అతిధిగా విచ్చేసి టీచర్స్ ను వంట వారిని సన్మానిశీచడం ఎంతో అభినందనీయం అని అన్నారు.ఇంకా ఈ సమావేసం లో సి ఆర్ పి సుశీల, హైస్కూల్ పీడీ గిరిజ మహిళల గురించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో టీచర్స్,విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

పౌష్టికాహారం లోపంతో
గర్భిణీలకు అనేక ఆరోగ్య సమస్యలు

బైరెడ్డిపల్లి, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఉదయం మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లి మండలానికి చెందిన గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ చంద్రన్ మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు ఆరోగ్యంపై సరైన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. పౌష్టికాహారం లోపిస్తే శరీర ఎదుగుదల మందగించడం, బలహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం, రక్తహీనత (అనీమియా), విటమిన్ లోపం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. పిల్లల్లో ఇది శారీరక, మానసిక వికాసాన్ని దెబ్బతీస్తుందని, ఎత్తు--బరువు తగ్గడం వంటి సమస్యలకు కారణమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, మహతి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసులు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ గురుకుల పాఠశాల, బాలికల
వసతి గృహాన్ని ఫుడ్ కమీషనర్ ఆకస్మిక తనిఖీలు
రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాపరెడ్డి

బంగారుపాళ్యం, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

బంగారుపాళ్యం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాపరెడ్డి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, వంట గదులను ఆయన పరిశీలించారుఅనంతరం మెనూ ఏవిధంగా అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అధినిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.అనంతరం బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి అక్కడ ఉంటున్న బాలికను అన్ని సదుపాయాలు ఆహారం అన్ని బాగున్నాయ అని అడిగి తెలుసుకుని సిబ్బందికి సూచనలు చేశారు.

బైరెడ్డిపల్లి లో విజయ్ ప్రతాపరెడ్డి ఆకస్మిక తనిఖీ

బైరెడ్డిపల్లి, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

బైరెడ్డిపల్లి లో ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంగన్వాడి కేంద్రాలు చౌక దుకాణాలను ఆయన తనిఖీ చేశారు ఇందులో భాగంగా సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. పిల్లలకు సరైన ఆహారం అందించాలని తూనికలు కొలతల్లో ఎటువంటి అవకతవకలు ఉండకూడదని అలా చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టండి

- అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించండి
- ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

విజయవాడ, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని.. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, జెడ్పీ సీఈవో కె.కన్నమ నాయుడుతో కలిసి అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 131 అర్జీలు అందగా.. వీటిలో ఎంఏయూడీకి 37, రెవెన్యూ 28, పంచాయతీరాజ్19, పోలీస్ 16, హౌసింగ్ 4, వ్యవసాయం 3, విభిన్న ప్రతిభావంతులు 3, డీఆర్డీఏ 3, విద్య 3, ఏపీ సీపీడీసీఎల్ 2, పౌర సరఫరాలు 2, మైన్స్ 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 2, గ్రామీణ నీటిసరఫరా 2 అర్జీలు రాగా వైద్యఆరోగ్యం, మార్కెటింగ్, దేవదాయ, ఇరిగేషన్, రవాణా శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ స్వీకరించినట్లు జేసీ తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాటాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాల్సిందేనన్నారు. నిబంధనలను పాటిస్తూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమస్యకు సంబంధించిన శాఖ జిల్లా స్థాయి అధికారి ప్రత్యేక దృష్టి సారించి సమస్యకు స్పష్టతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్ పోస్టర్ల ఆవిష్కరణ...

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం పీజీఆర్ఎస్ హాల్‌లో జేసీ ఇలక్కియ.. డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, వివిధ శాఖల అధికారులతో కలిసి హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్‌తో పాటు నివారించదగిన మరికొన్ని కేన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా ఈ వ్యాక్సిన్ ను 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా వేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో బాలికలకు హెచ్‌పీవీ టీకా కార్యక్రమం

ఆగిరిపల్లి, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)లో సోమవారం వైద్యాధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో బాలికలకు హెచ్‌పీవీ టీకా కార్యక్రమం నిర్వహించారు. సర్వైకల్ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ముందస్తుగా నివారించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఈ టీకా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ హెచ్‌పీవీ వైరస్ వల్ల మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. చిన్న వయస్సులోనే హెచ్‌పీవీ టీకా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఈ వ్యాధి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు. వ్యాధి నివారణలో టీకాలు అత్యంత ముఖ్యమని, విద్యార్థినులు మరియు వారి తల్లిదండ్రులు దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ వంటి అంశా లపై కూడా వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా బాలికలు టీకా పొందేలా సహకరిం చారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడుతున్నాయని స్థానికులు తెలిపారు.

సౌత్ జోన్‌కు ఎంపికైన ఎన్టీఆర్ జిల్లా క్రికెట్ జట్టు

మైలవరం, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

ప్రకాశం జిల్లాలో జరుగుతున్న 13వ ఏపీ స్టేట్ సీనియర్ మెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్--2026లో ఎన్టీఆర్ జిల్లా క్రికెట్ జట్టు తృతీయ స్థానం సాధించి సౌత్ జోన్‌కు ఎంపికైంది. సోమవారం జరిగిన పోటీలలో ఎన్టీఆర్ జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి మూడో స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ జట్టు సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో మంచి ప్రదర్శన చేసి జిల్లాకు పేరు తీసుకురావడం గర్వకారణమని ఆయన అన్నారు. రాబోయే సౌత్ జోన్ పోటీలలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం
హెచ్ ఫౌండేషన్ కో-చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ మొగులూరి ఎలిజబెత్ రాణి

ఆగిరిపల్లి, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

రక్తదానం ప్రాణదానంతో సమానమని హెచ్ ఫౌండేషన్ కో-చైర్మన్ మరియు మేనేజింగ్ ట్రస్టీ మొగులూరి ఎలిజబెత్ రాణి అన్నారు. ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలోని కుశలవా ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సోమవారం హెచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో "రక్తదానం -- జీవనదానం" పేరుతో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సుమారు 300 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు రక్తం అందక ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రక్తదానం ప్రాణాలను కాపాడే మహత్తర సేవ అని, యువతతో పాటు సంస్థలు కూడా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధన్ మోహన్ మరియు వారి వైద్య బృందం రక్త సేకరణ ప్రక్రియను నిర్వహించారు. హెచ్ ఫౌండేషన్ టీమ్ సభ్యులు టి.రేఖ, సోఫియా, స్వర్ణకుమారి, ప్రత్యూషా, జ్యోతి పాల్గొన్నారు.

ఆల్ ఇండియా నెట్ బాల్ పోటీలకు
పయనమైన కృష్ణా వర్సిటీ జట్టు

విజయవాడ, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్)

విజయవాడలోని ఎస్ఆర్ఆర్, సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకళాశాల ప్రిన్సిపాల్ కెభాగ్య లక్ష్మి అధ్యక్షతన కృష్ణా యూనివర్సిటీ పురుషుల నెట్‌బాల్ జట్టు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ పోటీలకు బయలుదేరినట్లు తెలిపారు. మార్చి 4, 5 తేదీలలో జరిగిన అంతర్ కళాశాల నెట్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు బి.దుర్గా ప్రసాద్, ఎస్.కె.నిజాముద్దీన్, పి.జాన్ బాబు, ఎం.మహేష్ (కె.బి.ఎన్ .కళాశాల), సి.హెచ్. సిరిల్, టి.శామ్యూల్ సుభాష్, బి.సాయి నిరూప్, ఎ.మోషే (ఎస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), పి.చందు, ఎన్.దుర్గా ప్రసాద్, టి.విజిత్ రాజ్ (ఆంధ్ర లయోలా కళాశాల), కె.శ్రీకాంత్ (డా.ఎల్.హెచ్. ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఈ జట్టును రూపొందించినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ మార్చి 9 నుండి 13 వరకు ఎస్ఏజీఈ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించ బడనుందని చెప్పారు. ఈ జట్టుకు వ్యాయామ విద్య విభాగాధిపతి డి యుగంధర్ మేనేజర్‌గా, అలాగే దారం నవీన్ కుమార్, అతిథి వ్యాయామ అధ్యాపకులను శిక్షకుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ తరపున ఈ స్థాయి పోటీలలో పాల్గొనడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి కళాశాలకు, యూనివర్సిటీకి , జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.

రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అలిగే జీవన్ ఏకగ్రీవ ఎన్నిక

నారాయణఖేడ్ మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : ఖేడ్ నియోజకవర్గానికి చెందిన అలిగే జీవన్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తార్నాక లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ఇంచార్జి మేజర్ చంద్రకాంత్, రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్. డాక్టర్. గాలి వినోద్ కుమార్ నియామక పత్రాన్ని అలిగే జీవన్‌కు అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు: ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ..అలిగే జీవన్ సామాజిక న్యాయం కోసం అనేక సంవత్సరాలుగా నిరంతరం పోరాటాలు చేస్తున్న తిరుగులేని నాయకుడని అన్నారు.ఈ సందర్భం గా రాష్ట్ర అధ్యక్షులు: గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. అలిగే జీవన్ సామాజిక న్యాయం, పూలే అంబేద్కర్ ఆశయాల కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు.

నూతన సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన నెహ్రూ నాయక్

నారాయణఖేడ్ మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : నూతనంగా ఎస్టి సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా ఖేడ్ నియోజకవర్గం అధ్యక్షుడిగా తుర్కపల్లి తండా సర్పంచ్ నెహ్రూ నాయక్ ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నెహ్రూ నాయక్ మాట్లాడుతూ.. నూతన తండా గ్రామ పంచాయతీలలో ఎస్టి సర్పంచ్‌లకు ఎలాంటి సమస్యలు ఉన్నా సర్పంచుల ఫోరం ద్వారా పరిష్కారం చేస్తామని అన్నాడు. అలాగే గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ గారితో, స్థానిక ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తో మాట్లాడి నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది సర్పంచ్‌లు, తాసిల్దార్ రాణాప్రతాప్, ఆల్ ఇండియా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ ప్రతినిధులు మేఘ్యా నాయక్,హరిసింగ్,రాజ్ కుమార్,మోతిరాం,రమేష్, దిశ కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ,సర్దార్, సురేష్ ,శంకర్ నాయక్,వినోద్,ప్రేమ్,రవీందర్ తదితరులు పాల్గొని నారాయణఖేడ్ నియోజకవర్గ నూతన ఎస్టిసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు నెహ్రూ నాయక్ గారిని ఘనంగా సన్మానించారు .

నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో వై. పండరి జన్మదిన వేడుక

నారాయణఖేడ్ మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : నారాయణఖేడ్ పట్టణంలో నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్,సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు: బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అఖిల్,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభాకర్,న్యాల్‌కల్ మండలం అధ్యక్షులు: నవీన్ కుమార్ సమక్షంలో జరిగింది.నాగల్ గిద్ద మండలం పరిధిలోని ఆవుత్‌పూర్ గ్రామం నివాసి అయిన వై. పండరి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా ముందుండి ప్రజలకు సేవలందిస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు.ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజాసంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు, ప్రజలు కలిసి ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా వై. పండరితో కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి సన్మానించారు. ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ,భవిష్యత్తులో కూడా ఇదే విధంగా మరింత సేవ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ (ఉపాధ్యాయుడు) భూమయ్య,కండక్టర్ రాజ్‌కుమార్,శాంత్‌కుమార్ తదితరులు పాల్గొని పండరికి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో ప్రత్యేక పూజలు చేసిన ఖేడ్: మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్ మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : ఖేడ్ నియోజకవర్గంకల్హేర్ మండల్ మర్ది గ్రామంలో సోమవారం శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జాతర జరగగా అట్టి కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా అహ్వానించగా వారు హాజరై శ్రీ రేణుక అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఖేడ్ నియోజకవర్గం లో పాడిపంటలతో పశుపక్షాదులతో నిండి, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నరసింహారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బోరంచ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి సేవ తూమ్నూర్ గ్రామ భక్తుల నుంచి ఆలయానికి రూ.65 వేల హుండీ అందజేత

– అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే

నారాయణఖేడ్ మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : ఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల పరిధిలో బోరంచ గ్రామ శివారులో మంజీరా నది ఒడ్డున ప్రసిద్ధి చెందిన బోరంచ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయం భక్తులకు విశేష ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచింది. ప్రతి ఆదివారం ఈ ఆలయానికి పరిసర గ్రామాల నుండి అనేక మంది భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు.ఈ క్రమంలో ఆదివారం మానూర్ మండలంలోని తూమ్నూర్ గ్రామానికి చెందిన మంగలి నారాయణ, మంగలి యాదగిరి, మంగలి మహేష్ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వారు తమ భక్తిని చాటుకుంటూ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయానికి సుమారు రూ.65,000 విలువైన హుండీని భక్తి పూర్వకంగా బహుకరించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు మరియు యువత యువకులు మంగలి నారాయణ, మంగలి యాదగిరి, మంగలి మహేష్‌ల సేవాభావాన్ని ప్రశంసిస్తూ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి తో ఖమ్మంలో సింథటిక్ ట్రాక్

క్రీడా సదుపాయాల దిశగా మంత్రి తుమ్మల అడుగులు

రూ.8.50 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల అథ్లెటిక్ ట్రాక్

పటేల్ స్టేడియంలో శరవేగంగా నిర్మాణ పనులు

పది రోజుల్లో అందుబాటులోకి రానున్న ట్రాక్

జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదికగా సర్దార్ పటేల్ స్టేడియం

ఖమ్మం యువత, క్రీడాకారుల్లో ఆనందోత్సాహాలు

హైదరాబాద్, ఖమ్మం,మార్చి 10(జర్నలిస్ట్ ఫైల్): ఖమ్మంలో సర్దార్ పటేల్ స్టేడియం త్వరలో అత్యాధునిక క్రీడా సదుపాయాలతో కొత్త రూపుతో క్రీడలకు నూతన వేదిక కానుంది. క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.8.50 కోట్ల వ్యయంతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ పనులు శరవేగంగా సాగుతుండగా, మరో పది రోజుల్లో పూర్తి చేసుకొని అందుబాటులోకి రానుంది. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అత్యాధునిక సౌకర్యాలతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం కొనసాగుతోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. సుమారు రూ.8.50 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఖమ్మం స్టేడియం జాతీయ, అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు అనువైన వేదికగా మారనుంది.

క్రీడా సదుపాయాల దిశగా తుమ్మల అడుగులు

ఖమ్మం జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జిల్లాలోని స్టేడియాల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణా వేదికలు, ఇతర సౌకర్యాలను సమకూర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

సింథటిక్ ట్రాక్‌తో అద్భుత ప్రయోజనాలు

సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం వల్ల క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అవకాశాలు లభించనున్నాయి. ఈ ట్రాక్ మన్నికైన, స్థిరమైన, సురక్షితమైన ఉపరితలాన్ని కలిగి ఉండటం వల్ల అథ్లెట్లు వేగవంతమైన సమయాలను సాధించడానికి సహాయపడుతుంది. అలాగే గాయాల ప్రమాదం తగ్గించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అన్ని వాతావరణ పరిస్థితుల్లో కూడా ఈ ట్రాక్‌పై శిక్షణ కొనసాగించవచ్చు. కనీస నిర్వహణతోనే దీర్ఘకాలం ఉపయోగించుకునేలా ఇది రూపొందించబడింది. సహజ మట్టి ట్రాక్‌తో పోలిస్తే సింథటిక్ ట్రాక్ అథ్లెట్లకు మెరుగైన ఉపరితలం, సౌకర్యం అందిస్తుంది. మట్టి ట్రాక్‌పై సాధన చేసి సింథటిక్ ట్రాక్‌పై పోటీల్లో పాల్గొన్నప్పుడు సుమారు 1.5 నుండి 2 సెకన్ల వరకు తేడా రావడం వల్ల పతకాలు కోల్పోయే పరిస్థితులు ఎదురవుతాయని క్రీడా నిపుణులు చెబుతున్నారు. అందువల్ల జిల్లా స్థాయి నుంచే సింథటిక్ ట్రాక్‌పై శిక్షణ చాలా అవసరమని వారు అభిప్రాయపడుతున్నారు.

క్రీడాకారుల్లో ఆనందం

సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్మిస్తున్న ఈ ట్రాక్ వల్ల ఖమ్మం జిల్లా యువతకు అథ్లెటిక్స్‌లో మరింత ప్రోత్సాహం లభించనుంది. ఇప్పటికే సీఎం కప్2024 క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్ విభాగంలో ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు 12 బంగారు పతకాలు సాధించడం విశేషం. సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందిన ఈ క్రీడాకారుల విజయాలు జిల్లాలో అథ్లెటిక్స్‌కు ఉన్న ప్రతిభను చాటుతున్నాయి. ఇప్పుడు సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి వస్తే జిల్లాలో మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు పెరుగుతాయని క్రీడాభిమానులు భావిస్తున్నారు. ఖమ్మం నగరంలో ఈ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు క్రీడాభిమానులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.– ట్రాక్ ప్రత్యేకతలు సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్. రూ.8.50 కోట్ల వ్యయంతో నిర్మాణం, అంతర్జాతీయ ప్రమాణాలతో ట్రాక్ ఏర్పాటు చేశారు. అన్ని వాతావరణాలకు అనుకూలం, గాయాల ప్రమాదం తగ్గింపు, వేగవంతమైన ప్రదర్శనకు సహకారం,జాతీయ, అంతర్జాతీయ పోటీల నిర్వహణకు అనువైన వేదిక కానుంది.

మహేశ్వరంలో ఉపసర్పంచ్ వార్డు మెంబర్లకు 5 రోజుల శిక్షణ కార్యక్రమం

(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం మార్చి 10 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన 3వ వార్డు మెంబర్ నయింఖాన్ మాట్లాడుతూ.. మహేశ్వరం మండల కేంద్రంలో సోమవారం నుండి ఐదు రోజులపాటు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ వార్డు మెంబర్లకు మరియు ఉపసర్పంచ్ లకు ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు మొత్తం 10 గ్రామపంచాయతీల ఉప సర్పంచ్లు వార్డు మెంబర్లు శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా రావాలని అధికారులు సూచించారు ఈ యొక్క కార్యక్రమానికి పెద్దపులి నగరం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు హాజరయ్యారని 3వ సభలో నయీమ్ ఖాన్ తెలియజేశారు

ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన ప్రిన్సిపాల్ డా. బండి రాజుకు ఘన సన్మానం

నేరెడ్ మెట్,మార్చి10: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మల్కాజిగిరి ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.కార్యక్రమానికి సమన్వయకర్తగా టీజీసీటీఏ (టీజీసీటా) అధ్యక్షుడు డాక్టర్ బ్రిజేష్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా టీజీసీటీఏ కార్యదర్శి డాక్టర్ బి. శ్రీనివాస్ గౌడ్, సంఘ బాధ్యులు డాక్టర్ పుట్ట సుభాష్ రెడ్డి హాజరై డాక్టర్ బండి రాజు విద్యా రంగానికి అందించిన సేవలను ప్రశంసించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్. యాదగిరి, డాక్టర్ జి.ఎన్. జగన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రాజేశ్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ గుణాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవిరాజు మాట్లాడుతూ బండి రాజు నాయకత్వంలో కళాశాల విద్యా, పరిపాలనా రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు.సన్మానానికి స్పందించిన డాక్టర్ బండి రాజు తనపై చూపిన ప్రేమాభిమానాలకు అధ్యాపకులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని, భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభ్యున్నతికి కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు.

హైదరాబాద్ లో విజయ వంతంగా మెగా రైతు మేళా

– రైతు నేత నల్లమల వెంకటేశ్వరరావు కు పురస్కారం

హైదరాబాద్, ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : మార్చి 8, 9 తేదీలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం, రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ సహకారంతో "మెగా రైతు మేళా 2026" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన అభ్యుదయ రైతులు పాల్గొని వ్యవసాయంలో అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులు, కొత్త సాంకేతికతలు, పంటల అభివృద్ధిపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు అభివృద్ధి చెందిన రైతులు వివిధ విభాగాల్లో ఉత్తమ రైతు పురస్కారాలు అందుకున్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) జాతీయ ఉపాధ్యక్షులు మరియు తెలంగాణ అగ్రి అండ్ హార్టికల్చర్ సొసైటీ అడ్వైజర్ అయిన నల్లమల వెంకటేశ్వరరావు ఉత్తమ రైతు నాయకుడిగా ఎంపికై, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.అలాగే విత్తన ఉత్పత్తి రంగంలో విశేష సేవలు అందించినందుకు ఖమ్మం జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన పి. భాస్కరరావు కి ఉత్తమ రైతు పురస్కారం లభించింది. ఆయిల్ పామ్ సాగులో విశేష ప్రగతి సాధించినందుకు సత్తుపల్లి మండలానికి చెందిన వేంపాటి లక్ష్మీనారాయణ కి కూడా ఉత్తమ రైతు పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం వైస్ చాన్సలర్ ఎ. జానయ్య, వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుచరిత దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, పంటల వైవిధ్యీకరణ, ఉద్యాన పంటల అభివృద్ధిపై నిపుణులు అవగాహన కల్పించారు. ఖమ్మం జిల్లాకు చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పురస్కారాలు అందుకోవడం జిల్లాకు గౌరవకారణంగా నిలిచింది.

స్థానిక పరిపాలన లో ఉన్న ప్రాధాన్యత చట్టసభల్లో లేదు

– ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి

– ఉత్పత్తి లోను అంతరిక్ష పరిశోధనల్లో మహిళలు అగ్ర భాగం

– మాజీ ఎంపీపీ, మహిళా రైతు కో కన్వీనర్ బొంతు సమత

ఖమ్మం, వైరా, (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక పరిపాలన లో కల్పించిన ప్రాధాన్యత చట్టసభల్లో ఇవ్వడం లో ఆలస్యం చేయడం లో అర్థం లేదు అని ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ అన్నారు. తెలంగాణ రైతు సంఘం, ఐద్వా సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా రైతు సంఘం పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు అధ్యక్షతన జరిగిన సెమినార్ లో భారతి, రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మూలం గా ప్రజలు నష్టపోతున్నారు అని అన్నారు. యుద్ధం లోను కరువు కాటకాలు సంభవించిన మొదటి నష్టపోయేది మహిళలు అన్నారు, రైతు మహిళా కో కన్వీనర్, మాజీ ఎంపీపీ బొంతు సమత మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మూలమైన ఉత్పత్తి లోను అంతరిక్ష పరిశోధనల్లో ను అగ్రభాగాన నిలిచిన చరిత్ర మహిళలకు ఉందని అన్నారు. మరోవైపు రోజు, రోజు కు మహిళలు పై దాడులు పెరుగుతున్నాయి అని అన్నారు . సమస్యలు పరిష్కారం కోసం శ్రామిక మహిళా దినోత్సవం కు కారణమైన త్యాగాల చరిత్ర ను అర్థం చేసుకుని పట్టుదలతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, సైన్స్ ఉద్యమ రాష్ట్ర నాయకులు మల్లెంపాటి వీరభద్రం, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ మహిళా సంఘం వైరా పట్టణ అధ్యక్షులు తోట కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చే పరీక్షా సామాగ్రి పంపిణీ

ఖమ్మం, ముదిగొండ, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలపరిధిలోని యడవల్లి ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులకు పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు పరీక్షా సామాగ్రి అందించారని ప్రధానోపాధ్యాయులు యం. నాగలక్ష్మి తెలిపారు.నిరుపేద విద్యార్థులకు ఉపయుక్తంగా అడిగినదే తడవుగా పరీక్షా సామాగ్రి అందజేసిన పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ధన్యవాదములు తెలిపారు.సోమవారం నాడు పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరీక్షాసామాగ్రిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బిశ్రీనివాసరావు, యం. ఆనందకుమార్, ఆర్. లింగయ్య, పిపద్మావతి, ఎస్. సునీత, వి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉచిత వాహనాల పంపిణీ

మల్కాజిగిరి, మార్చి 10 : మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికలాంగులకు ఉచిత వాహనాల పంపిణీ కార్యక్రమం సోమవారం అల్వాల్‌లోని సఖి కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు బ్యాటరీ సైకిళ్లు, బ్యాటరీ వీల్‌చైర్లు, మోటార్ వాహనాలను అందజేశారు.గత 2025 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు ఈ వాహనాలను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందజేసింది. వాహనాలతో పాటు రిజిస్ట్రేషన్, హెల్మెట్, ఒక లీటర్ పెట్రోల్ కూడా ప్రభుత్వం తరఫున అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో, ఎంఆర్‌వో, వికలాంగుల జిల్లా శాఖ అధికారి శారద, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి పాల్గొన్నారు. అలాగే వికలాంగుల సంఘాల నాయకులు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్. వినయ్, టీవీవీహెచ్ఎస్ అధ్యక్షుడు కిరణ్ గుత్తికొండ, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, జి. శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో (99) ఫిర్యాదులు.

జిల్లా అదనపు కలెక్టర్ కె చంద్రారెడ్డి.

ప్రజావాణికి వచ్చిన సమస్యలు పెండింగ్ లో పెట్టకుండాపరిష్కరించాలి.

సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇబ్రహీంపట్నం మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులుఅందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ 19, ఇతర శాఖలకు 80, మొత్తం 99 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి లో దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మంథని/పెద్దపల్లి మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ పట్టణం మార్కండేయ కాలనీ కు చెందిన గంగాదేవి శ్రీనివాస్ దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భోజన్న పేట గ్రామానికి చెందిన అవుల వసంత తమ గ్రామంలో ఇంటి నిర్మాణం చేసుకుంటున్న సమయంలో నిర్మాణ పనులను కొందరు అనుమతి లేదంటూ అడ్డుకుంటున్నారని, ఇంటర్ నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా పంచాయతీ అధికారి కు రాస్తూ విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన సంపూర్ణ తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిందని, బేస్మెంట్ వరకు నిర్మాణం చేసినప్పటికీ మొదటి విడత బిల్లు డబ్బులు రాలేదని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి చుట్టూ పరిశుభ్రతా పాటించండి దేవేందర్ నాయక్

తడి చెత్త = పొడి చెత్త వేరు చేయాలి

పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి అందరూ సహకరించండి సర్పంచ్ దేవేందర్ నాయక్

(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం మార్చి 10 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామపంచాయతీ అనుబంధ మైలార్ బై తండా లో సీసీ రోడ్లు ప్రారంభించడం జరిగిందని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలియజేశారు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కే ఎల్ ఆర్ చొరవతో.. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు గ్రామాల్లో పరిశుభ్రత పెంపొందించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడం ఎంతో అవసరమని గ్రామ సర్పంచ్ దేవేందర్ . నాయక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెలి జర్ల గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ,గ్రామ సర్పంచ్ దేవేందర్ . నాయక్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే పద్ధతిపై వివరించారు. తడి చెత్తను వంటగది అవశేషాలు, కూరగాయల తొక్కలు వంటి వాటిగా, పొడి చెత్తను ప్లాస్టిక్, కాగితాలు, ఇతర వ్యర్థాలుగా వేరు చేసి చెత్త సేకరణ వాహనానికి అందించాలని సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దేవేందర్. నాయక్ మాట్లాడుతూ...పరిశుభ్రమైన సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా గ్రామంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చని తెలిపారు.ప్రతి ఇంట్లో చెత్తను వేరు చేయడం అలవాటు చేసుకుంటే గ్రామంలో పరిశుభ్రత పెరుగుతుందని,ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు.గ్రామాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యంగా ఉంచడం కోసం గ్రామ ప్రజలు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామ పంచాయతీ చేపట్టే పరిశుభ్రత కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఉప సర్పంచ్ మహేందర్ వార్డ్ నెంబర్ ఎం దేవా పద్మ కె రజిత, ఎం రవి, ఎం లావణ్య, ఎం జ్యోతి,ఎం ధర్మ ఎం మోహన్ ఎం శ్రీను విలేజ్ సెక్రట్ నవీన్, యాదవ్, ఎం శ్రీనివాస్, ఎం గణపతి,ఎం రమేష్,తదితులు పాల్గొన్నారు

మంథనిలో మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయినిలకు సన్మానం

మంథని, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : సమాజంలో మహిళల హక్కులు, సమాన అవకాశాల కోసం ప్రారంభమైన ఉద్యమాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో, ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి సూచించిన నినాదం "సమానత్వంతో ఆలోచించి, తెలివిగా నిర్మించి, మార్పు కోసం సృజనాత్మకంగా పనిచేయడం" ను ఆదర్శంగా తీసుకుని మంథని మండల కేంద్రంలో ఎస్టియు మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దాసరి లక్ష్మితో పాటు మంథని మండలంలో ఉపాధ్యాయినిలుగా పనిచేస్తున్న వారిలో నుండి పది మంది ఉపాధ్యాయినిలను, ముగ్గురు సీఆర్‌పీలను సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు జె.సురేష్, ఈ.నరసింహారావు, ఎస్టియు రాష్ట్ర బాధ్యుడు వి.సహేందర్, మంథని మండల అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం.రాము, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బి.చంద్రశేఖర్, ఎన్.లక్ష్మణ్, సీఆర్‌పి మల్లన్న పాల్గొన్నారు.

అర్హులైన బాలికలకు పూర్తి స్థాయిలో హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ అందించాలి

ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

- మార్చి 8 నుంచి మార్చి 14 వరకు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు

హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ పై సూచనలు జారీ చేసిన అదనపు కలెక్టర్

ఖమ్మం, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : అర్హులైన బాలికలకు పూర్తి స్థాయిలో హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ అందించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్, హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కార్యక్రమంపై జిల్లా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించడం జరిగిందన్నారు. 14 సంవత్సరాలు పూర్తి చేసుకొని 15 సంవత్సరాల వరకు వయస్సు ఉన్న బాలికలకు హెచ్.పీ.వి. టీకా అందించడం ద్వారా గర్భాశయ ముఖ ద్వారా వచ్చే క్యాన్సర్ ను కట్టడి చేసే అవకాశం ఉంటుందని అన్నారు.ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సి.హెచ్.సి. లు నేలకొండపల్లి, తిరుమలాయ పాలెం, కల్లూరు, మధిర, పెనుబల్లి, సత్తుపల్లి, వైరా ఏరియా ఆసుపత్రి నందు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాక్సినేషన్ అందిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువు తున్న బాలికల్లో 14వ సంవత్సరం పూర్తి చేసుకుని 15వ సంవత్సరంలోకి వస్తున్న ఆడపిల్లలందరూ వారి తల్లిదండ్రులతో ఏదైనా సి.హెచ్.సి., జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లి తప్పనిసరిగా హెచ్.పి.వి. వాక్సినేషన్ తీసుకునేలా మండల విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకునేటట్లు ఆదేశాలు జారీ చేయాలని డిఈఓను ఆదేశించారు.బాలికల తల్లిదండ్రుల ఆమోదంతోనే హెచ్.పీ.వి. టీకా వేస్తామని, హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ అనంతరం అరగంట పాటు పరిశీలించిన తర్వాత వారిని పంపడం జరుగుతుందని, ఈ వ్యాక్సిన్ వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని, జిల్లా వ్యాప్తంగా 11 వేల 460 మంది బాలికలు 14 సంవత్సరాలు పూర్తి చేసుకొని 15 సంవత్సరాల వరకు వయస్సు మధ్య ఉండవచ్చని అంచనా ఉందని, వీరందరికీ వ్యాక్సినేషన్ అందించాలని తెలిపారు. హెచ్.పీ.వి. టీకా వేసుకోవడం వల్ల కలిగే లాభాలను తల్లిదండ్రులకు విస్తృతంగా వివరించి అధిక సంఖ్యలో బాలికలకు టీకా అందేలా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మార్చి 8 నుంచి మార్చి 14 వరకు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్లకోమా ఎటువంటి లక్షణాలు లేకుండా కంటి చూపు ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉందని, కంటిపై ఎటువంటి ఒత్తిడి ఉన్న వెంటనే పరిశీలించి అవసరమైన చికిత్స తీసుకోవాలని అన్నారు.గ్లకోమా పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా అవసరమైన ఐఈసి మెటీరియల్ తయారు చేసి ప్రతి గ్రామపంచాయతీ, అంగన్వాడి కేంద్రాలకు అందించాలని అదనపు కలెక్టర్ డిఎం అండ్ హెచ్ఓ ను ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా ఆందోళన

- కల్వకుంట్ల కవిత అరెస్ట్

ఖమ్మం జెడ్పీ సెంటర్ దిగ్బంధం, కవితతో చర్చలు జరిపిన ఆర్డీవో - కలెక్టర్ వచ్చి హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తానని కవిత స్పష్టీకరణ - పోలీసుల ఓవరాక్షన్, కల్వకుంట్ల కవిత, విశారదన్ మహారాజ్ సహా పలువురి అరెస్ట్ - మహిళా కానిస్టేబుళ్లు లేకుండా కవిత సహా మహిళ నాయకుల అరెస్ట్ - వెలుగుమట్ల బాధితులు, జాగృతి నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులను దుర్భాషలాడుతూ తోసేసిన పోలీసులు అరెస్ట్ సందర్భంగా తోపులాట, పలువురికి గాయాలు, సొమ్మసిల్లిన మరికొందరు - పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జాగృతి నాయకులు - నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పోలీసులపై మహిళ కమిషన్ కు జాగృతి నేతల ఫిర్యాదు - తొలుత వెలుగుమట్ల బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పిన కవిత - బాధితుల ఇళ్లు కూల్చిన చోటే వారికి కొత్త ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ - ఈ ప్రభుత్వానికి, నాయకులకు ఆదబిద్దల ఉసురు తగులుతుందన్న కవిత

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లాలోని జెడ్పీసెంటర్ లో వెలుగుమట్ల బాధితుల పక్షాన ధర్నాకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహారాజ్ సహా జాగృతి నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఓవరాక్షన్ చేశారు. మహిళ కానిస్టేబుళ్లు లేకుండానే కల్వకుంట్ల కవిత సహా మహిళ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పలువురు గాయపడగా, మరికొందరు సొమ్మసిల్లిపడిపోయారు. గాయపడిన వారిని వెంటనే హాస్పిటల్ కు తరలించాలని కవిత డిమాండ్ చేశారు. అరెస్టు సమయంలో నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారు. దీంతో పోలీసుల తీరుపై జాగృతి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ కానిస్టేబుళ్లు లేకుండా మహిళలను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మహిళల పట్ల అమానుషంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని జాగృతి నాయకులు మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు.

- ఖమ్మం జెడ్పీ సెంటర్ లో ఆందోళన

తొలుత వెలుగుమట్ల బాధితులను కవిత పరామర్శించారు. ఆ తర్వాత వెలుగుమట్ల బాధితులతో కలిసి కలెక్టరేట్ కు ర్యాలీగా వెళ్తూ జెడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. కలెక్టర్ వచ్చి వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం ఆర్ డీవో చర్చలు జరిపినప్పటికీ స్పష్టమైన హామీ రాకపోవటంతో ఆందోళన కొనసాగించారు. దీంతో పోలీసులు ఓవరాక్షన్ కు దిగారు. జాగృతి నాయకులు, వెలుగుమట్ల బాధితులు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులను దుర్భాషలాడుతూ తోసేశారు. విచక్షణరహితంగా వ్యవహరిస్తూ వారిపై బలప్రయోగం చేసి అదుపులోకి తీసుకున్నారు.

- ప్రభుత్వానికి ఉసురు తగులుతుంది

వెలుగుమట్ల లో బుల్డోజర్లతో ఇళ్లను నేలమట్టం చేసిన ప్రభుత్వానికి, నాయకులకు బాధిత మహిళల ఉసురు తగులుతుందని కవిత అన్నారు. అంబేద్కర్ భవన్ లో వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన తర్వాత ఆమె మాట్లాడారు. వెలుగుమట్లలో బాధితుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందన్నారు. ఎగ్జామ్స్ సయమంలో పుస్తకాలతో సహా రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయటం ఆవేదన కలిగించిందన్నారు. బాధితుల ఆవేదన కొంతమంది రాజకీయ నాయకులకు ఎగ్జిబిషన్ మాదిరిగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మీ ఇళ్లను కూల్చేసే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు పాపాలు కడుక్కునే ప్రయత్నంలో బాధితులకు భోజనం పెడుతున్నారన్నారు. తాను ఎక్కడున్న సరే మహిళలు, పేదల పక్షాన ఉంటానని అన్నారు. వెలుగుమట్ల బాధితుల సమస్య పరిష్కారం అయ్యేవరకు వారి పక్షాన పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. విశారదన్ మహారాజ్ తో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, ప్రజా సంఘాలు కూడా బాధితులకు మద్దతుగా ఉన్నారన్నారు. అందరం కలిసి వెలుగుమట్ల బాధితుల సమస్య పరిష్కారమయ్యే వరకు వదలమని చెప్పారు. ముఖ్యమంత్రి సహా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బాధితుల ఇళ్లు కూల్చిన చోటే వారికి కొత్త ఇళ్లు కట్టించాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేదల మీద జులుం నడుస్తోందని, వారి ఇళ్ల మీదకు బుల్డోజర్లు పంపుతూ అన్యాయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఓ వైపు రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే ఆ రాజ్యాంగాన్ని కూనీ చేసేలా పేదల మీదకు బుల్డోజర్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి చర్యలకు వ్యతిరేకంగా పోరాటం చేద్దామన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు .

ప్రజావాణికి 41 పిర్యాదులు.

సంగారెడ్డి, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులే హాజరుకావాలని, సమయపాలన పాటించాలని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇన్‌చార్జ్) పాండు అన్నారు.జిల్లాఅధికారులు హాజరుకాకుండా, వారి సహాయకులు హాజరవుతున్న విషయం గమనించామని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేసారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 పిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తారని, వారి సమస్యలను అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడమే కాకుండా, తగిన పరిష్కార మార్గాలను కూడా చూపించాలని సూచించారు. ప్రజా సమస్యల పై ఆయా శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి , నారాయణ్ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి , జడ్పీసీఈఓ జానకిరెడ్డి , ఆర్డీఓలు ,వివిధ శాఖల జిల్లా అధికారులు ,ప్రజలు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మంథని/ పెద్దపల్లి, మార్చి 10 (జర్నలిస్ట్ ఫైల్) : పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయం ప్రాంగణంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.....ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీ రెడ్కో) ఆధ్వర్యంలో ప్రజలకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై విశిష్ట ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతి విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ పై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కార్బన్ ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ఈ పథకం పై విస్తృత ప్రచారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం 10 మంది లబ్ధిదారులు తమ ఇంటి రూఫ్ పై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. మూడు కిలో వాట్ల సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం 78,000 సబ్సిడీ అందిస్తుందని, ప్రతి నెల దాదాపు 2000 రూపాయల వరకు విద్యుత్ బిల్లు ఆదా చేయవచ్చని తెలిపారు. సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి పర్యావరణ హితమని మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని సూచించారు. పీఎం సూర్య పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టి.జి. ఎన్.పి.డి.సి.ఎల్ ఎస్ఈ వి. గంగాధర్, డీ.ఈ రాజ బ్రహ్మయ్య చారి, రెడ్ కో జిల్లా మేనేజర్ డి. మనోహర్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ గౌరవం సమాజ అభివృద్ధికి పునాది

దేశ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర డాక్టర్ కాపా చంద్ర కళ మురళీకృష్ణ

(జర్నలిస్ట్ ఫైల్) వైరా మార్చి 10 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైరా లయన్స్ క్లబ్ మరియు గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు కె వి సి ఎం రెసిడెన్షియల్ స్కూల్ నందు క్లబ్బుల అధ్యక్షులు వై బుచ్చి రామారావు . జాలా పుల్లారావు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పాసుంగల పాటి రాధిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ చంద్రకళ మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదు, స్త్రీ లేనిదే గమనం లేదు. ఒక చిన్నారిగా, సోదరిగా, భార్యగా, తల్లిగా, శక్తి స్వరూపిణిగా ఇలా స్త్రీ జీవితంలో ఎన్నో పాత్రలు పోషిస్తూ, కుటుంబ బాధ్యతలను తన భుజాలపై మోస్తుంది అని, మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ సమాజ అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని,మహిళలకు విద్య, ఆత్మవిశ్వాసం, అవకాశాలు కల్పిస్తే వారు సమాజాన్ని ముందుకు నడిపించే శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. లయన్స్ కంటి హస్పటల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ నేటి మహిళలు విద్య, సాంకేతికత, వ్యాపారం వంటి అనేక రంగాల్లో విశేష విజయాలు సాధిస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, రాజకీయ రంగంలో కూడా ఈరోజు మహిళలు దూసుకుపోతున్నారనిఈ రోజు కేవలం శుభాకాంక్షలు చెప్పుకునే రోజు కాకుండా, మహిళల హక్కులతో పాటు, సమాజంలో వారికి ఉండాల్సిన గౌరవాన్ని గుర్తుచేసుకునే రోజు అని పూర్వం నుండి ఇప్పటి వరకు, ఎందరో మహిళలు ఎన్నో అడ్డంకులను ఎదిరించి, ఆత్మగౌరవంతో నిలబడి తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకుంటూ. శాస్త్ర సాంకేతిక రంగం నుండి అంతరిక్షం వరకు, క్రీడల నుండి రాజకీయాల వరకు,స్త్రీలు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు అని అన్నారు. ప్రిన్సిపల్ పాసంగుల పాటి రాధికమాట్లాడుతూ మహిళలు కుటుంబం, సమాజం, దేశ నిర్మాణంలో కీలక స్థానాన్ని కలిగి ఉన్నారని, విద్యార్థినులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జిల్లా విజన్ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు జిల్లా మహిళా సెలబ్రేషన్ చైర్మన్ ఉంద్రు వరలక్ష్మి లయన్స్ క్లబ్ మహిళ కోఆర్డినేటర్ మాదినేని సునీత క్లబ్బు సెక్రటరీ చెరుకూరు శ్రీనివాసరావు కోశాధికారి గద్దె నీరజ ఉయ్యూరు రామకృష్ణ గజ్జల కృష్ణమూర్తి నూకల శ్రీనివాసరావు గజ్జలమణి నాళ్ల నాగమల్లేశ్వరి సుగ్గల మాధవి రంగా వాసవి నూకల అన్నపూర్ణ మిట్టపల్లి అనురాధ జాలమహాలక్ష్మి 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి మాదినేని నాగరాణి ఏదు నూతల శ్రీదేవి చింతోజు సీత పెనుగొండ ఉపేందర్ రావ్ రంగా సత్యనారాయణ కొమిరిశెట్టి శ్రీధర్ పుష్పావతి ఏపూరి రాజారావు గంగవరపు కిషన్ రాయి టీచర్లు బి శారద జరీనా బేగం పావని పి శారద ఎస్ కే గౌసియా మౌనిక తదితరులు పాల్గొన్నారు

ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): మహిళల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతిని గుంటూరులో ఘనంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తురక రామారావు ఆధ్వర్యంలో స్థానిక లాల్‌పురం రోడ్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళల విద్య కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలేకు జిల్లా ఓబీసీ మోర్చా తరఫున వినమ్ర నివాళులు అర్పిస్తున్నామని తురక రామారావు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ మహిళల విద్యను సమాజం అంగీకరించని కాలంలో అవమానాలు, అవరోధాలు, దాడులు ఎదుర్కొంటూ కూడా అమ్మాయిలకు విద్యా దీపం వెలిగించిన తొలి గురువుగా సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్ మాట్లాడుతూ "విద్యే సమానత్వానికి మార్గం" అని నమ్మి అణగారిన వర్గాల పిల్లలకు పాఠశాలలు ప్రారంభించి సమాజ మార్పుకు నాంది పలికిన గొప్ప సంస్కర్త సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఆమె చూపిన మార్గం మనకు ప్రేరణగా నిలుస్తుందని, విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కట్టుబడి పనిచేయడం ద్వారా ఆమెకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు భీమినేని చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముద్రబోయిన నాగరాజు, జిల్లా మీడియా కన్వీనర్ వంకాయలపాటి మోహనబాబు, కోశాధికారి కసినబోయిన శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కానుమోలు సురేష్, కార్యవర్గ సభ్యుడు పల్లపు విజయకుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపుదలకు కృషి జరగాలి

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): భారతదేశంలో విద్యార్థులలో ప్రశ్నించేతత్వాని పెంపొందించి,సృజనాత్మకత అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి జరగాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరులోని పెన్షనర్స్ భవన్ లో 7వ అమరావతి నేషనల్ ఒలింపియాడ్ పరీక్షల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ముఖ్య అతిథిగా హాజరైన జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ అమరావతి ఎడ్యూ హబ్ గత 7 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నేషనల్ ఒలింపియాడ్ పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులను ఆలోచింప చేస్తుందన్నారు. ఈ సంవత్సరం 5 రాష్ట్రాలలో 100కు పైగా పాఠశాలల్లో 10 వేల మందికి పైగా విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షలల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. భారతదేశంలో 30 కోట్ల మంది నిరాక్షరాస్యులు ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో దేశంలో 36వ స్థానంలో కొనసాగుతుందన్నారు.

పరిశోధనలపై ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల స్థూల జాతీయోత్పత్తిలో 3 శాతానికి పైగా ఖర్చు చేస్తుంటే భారతదేశంలో కేవలం 0.6 శాతం మాత్రమే వెచ్చిస్తుందన్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ర్యాంకులో ప్రపంచంలోని 139 దేశాలలో ఇండియా 38వ స్థానంలో ఉందన్నారు. నోబుల్ బహుమతులను అమెరికా 425, బ్రిటన్ 144, జర్మనీ 115 పొందగా జనాభాలో అగ్రస్థానంలో ఉన్న ఇండియా కేవలం 5 నోబుల్ బహుమతులను మాత్రమే పొందిందన్నారు. ప్రపంచంలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు ఉన్న మొదటి 120 విద్యాలయాల్లో భారత్ కు స్థానం దక్కలేదన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత పెంపుదలకు వ్యాస రచన, వక్తృత్వ , క్విజ్, చిత్రలేఖనం లాంటి పోటీలు ప్రతి విద్యా సంస్థలలో జరగాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ రేడియాలజిస్ట్ డా॥ సుస్మిత అమరావతి నేషనల్ ఒలింపియాడ్ పరీక్షలు గణితం, సైన్స్, డ్రాయింగ్ మరియు హ్యాండ్ రైటింగ్ లలో విజేతలైన 82 మంది విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో, నిబద్ధత తో సమయపాలన పాటిస్తూ విద్యను అభ్యసించాలని కోరారు. లక్ష్యాలను, గమ్యాలను రూపొందించుకుని అకుంఠిత దీక్షతో కృషి చేస్తే విజేతలుగా నిలుస్తారన్నారు. రిసోర్స్ పర్సన్ దిడ్డి సతీష్ ప్రసంగిస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి క్రమబద్ధమైన కృషి చేయాలన్నారు.

అమరావతి ఎడ్యుకేషన్ హబ్ వ్యవస్థాపకులు డి. లక్ష్మణరావు ప్రసంగిస్తూ విద్యార్థులలో నిగూఢంగా ఉన్న ఆలోచనలను పెంపొందించడానికి గత ఏడు సంవత్సరాలుగా జాతీయస్థాయిలో అమరావతి నేషనల్ ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో 82 మంది విజేతలకు, మరియు 20 మంది ఉపాధ్యాయులకు గురుదేవోభవ అవార్డులను ప్రధానం చేశారు. తొలుత బాల బాలికలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆలోచింప చేసాయి.

మౌజాన్, ఇమామ్‌లకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ రెండు వారాల్లో జనాజా వాహనం అందజేస్తాం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో పట్టాభిపురం మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాది ఖానాలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 55 మసీదుల మౌజాన్‌లు, ఇమామ్‌లకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా మౌజాన్‌లు, ఇమామ్‌లకు బట్టలు మరియు అవసరమైన సరుకులను అందజేశారు. ముస్లిం సోదరుల అంత్యక్రియల సమయంలో ఇబ్బంది లేకుండా ఉండటానికి ఒక జనాజా వాహనాన్ని ఇస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ రంజాన్ వంటి పవిత్ర మాసంలో అల్లాహ్ సేవలో నిత్యం గడిపే మౌజాన్‌లు, ఇమామ్‌లకు సహాయం చేయడం ఎంతో సంతోషకరమని, పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరి అభివృద్ధి కోసం తాను రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజల ఆశీస్సులతోనే ఈ స్థాయికి చేరుకున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మతభేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండడమే నిజమైన ఆనందం, శాంతి అని ప్రతి మతం బోధిస్తుందని పేర్కొన్నారు.

ముస్లిం సోదరులు తమ సమస్యలుగా ఖబరస్థాన్, మసీదు మరియు విద్యాసంస్థల అవసరాలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారం కోసం అధికారులు, కమిషనర్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మరియు ఇతర అధికారులతో చర్చలు జరుపుతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. త్వరలోనే ఖబరస్థాన్ కోసం తగిన స్థలాన్ని గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే 28వ డివిజన్‌లో ఆడపిల్లల కోసం స్కూల్ ఏర్పాటు చేసే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడించారు. రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందులు కాకుండా ముస్లిం సోదరుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని జనాజా వాహనం (వైకుంఠ రథం) ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. రానున్న వారం రోజుల్లోనే ఆ జనాజా వాహనాన్ని అందజేస్తామని, దీనిని నిర్వహించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ఎండీ గళ్ళా రామచంద్రరావు మాట్లాడుతూ ముస్లిం సమాజంతో తమకు చిన్ననాటి నుంచే అనుబంధం ఉందని, ఎన్నికల సమయంలో ముస్లిం సోదరులతో ఏర్పడిన అనుబంధం ద్వారా వారి విద్య, వైద్య రంగాలలో ఉన్న అవసరాలు తెలుసుకున్నామని తెలిపారు. ఉర్దూ మాధ్యమంలో ఒక స్కూల్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో మైనారిటీ నాయకులతో కలిసి సరైన స్థలం ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అదే విధంగా శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ సంస్థ తరఫున జనాజా వాహనాన్ని వారం రోజుల్లో అందజేస్తామని ప్రకటించారు. మైనారిటీలు విద్యాపరంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపడతామని, పశ్చిమ నియోజకవర్గంలో మైనారిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్. అస్మతుల్లా, షేక్. అబ్దుల్ రహీమ్, షేక్. రఫీ, షేక్. ఖాదర్ బుడే, షేక్. రఫీ, స్థానిక కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్, షేక్. నజీర్, షేక్. బాజి, షేక్ లాల్ వజీర్, షేక్. సుబాని, షేక్. రుస్తుం బాబు, షేక్. ఇమ్రాన్ , షేక్ బిడింగ్ సుభాని , షేక్. మస్తాన్ వలి, షేక్. గౌస్, షేక్ బాషా, షేక్ మీరా వలి , షేక్. కరీం, షేక్ హుస్సేన్ , షేక్. అన్వర్, షేక్. ఈశావలి, షేక్. గౌసుల, షేక్. రషీద్, షేక్. ఆదమ్, షేక్. రబ్బానీ, మరియు మైనారిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, మహిళా నాయకులు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని తీర్చిదిద్దుతాం

○ గిరిప్రదక్షిణ రోడ్డు పనులను పరిశీలించిన చీఫ్ విప్ జీవీ

వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్): వినుకొండ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా, ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. కొండ చుట్టూ జరుగుతున్న గిరి ప్రతిక్షణ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయంగా ప్రొక్లైనర్ యంత్రాన్ని స్వయంగా ఆయన నడిపి రోడ్డు నిర్మాణ పనుల వివరాలను కూలంకషంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడుతూ త్రేతా యుగంలో సాక్షాత్తు శ్రీరామచంద్రుల వారు కొండపై శివలింగాన్ని ప్రతిష్టించారని అందుకే శ్రీ రామలింగేశ్వర స్వామి గా ప్రసిద్ధిగాంచడం జరిగిందన్నారు. సీత జాడ విన్న కొండగా ఎంతో చారిత్రాత్మక చరిత్ర కలిగిన వినుకొండ కొండను ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి గాంచుతోందని అన్నారు. కొండపై శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణం, ఘాట్ రోడ్, గిరి ప్రదర్శన రోడ్డు నిర్మాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తమ హయాంలో నిర్మాణానికి నోచుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వినుకొండ ప్రజల ఆకాంక్ష మేరకు కొండచెట్టు 1.50 కోట్లతో తారు రోడ్డు వేయటం జరుగుతుందని, రెండు వైపులా మరో 20 అడుగులు గ్రావెల్ మట్టి రోడ్డు కూడా వేయడం జరుగుతుందన్నారు. అలాగే ఘాట్ రోడ్డు నిర్మాణానికి 12.50 కోట్లు అవసరమని ఇంజనీర్ అధికారులు నివేదించడం జరిగిందని, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా నిధులు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలో ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే తొలితగతిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణం పూర్తవుతుందని వివరించారు. వినుకొండ పట్టణానికి శాశ్వత త్రాగునీటి పథకం ద్వారా 240 కోట్లు నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేశాయని, ఇప్పటికే 30 కోట్లతో పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మిగిలిన పనులకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిందని, త్వరలో పనులు ప్రారంభమై వినుకొండకు శాశ్వత త్రాగునీటి పథకం పూర్తి అవుతుందని తెలిపారు. అవసరమైనచోట ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు చేపడుతున్నారని, పట్టణానికి ప్రతిరోజు త్రాగునీటి సరఫరా అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్న పూలే దంపతుల ఆశయం

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):అణగారిన వర్గాల అభ్యున్నతికి మహిళలు విద్యావంతులు కావాలన్న మహాసంకల్పం కార్యరూపంలోకి తెచ్చిన ఆదర్శ మహిళ సావిత్రిబాయ్ పూలే అని,పూలే దంపతుల ఆశయాన్ని కూటమి ప్రభుత్వం ఆచరణలో చూపుతుందని, సావిత్రీబాయ్ బాపూలే వర్ధంతి వేళ టిడిపి బిసి సంఘ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.

స్థానిక రామలింగేశ్వర పేటలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు, పట్టణ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ఫణిదపు దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో సావిత్రీబాయ్ పూలె 129వ,వర్ధంతిని పురస్కరించుకుని, నిర్వహించిన కార్యక్రమంలో, సావిత్రీబాయ్ చిత్రపటం చెంత పువ్వులుంచి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పద్మశాలీయ వెల్ఫేర్ కార్పోరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ మాట్లాడుతు బడుగు బలహీన వర్గాలను అణిచివేతకు గురిచేసే నాటి సామాజిక పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్న పూలే దంపతులు, మహిళా విద్యా వ్యాప్తి ద్వారానే సమాజంలో, అణగారిన వర్గాలకు వికాసం అనే దృక్పదంతొ పని చేశారని అన్నారు. సావిత్రీ బాయ్ పూలే మహిళా ఉపాధ్యాయు రాలుగా అనేక అవమానాలను ధైర్యంగా ఎదుర్కొన్న ఉదంతాలను వివరించారు.

మహిళ ఆర్థిక, సామాజిక, రాజకీయ స్వావలంబన లక్ష్యంగా పూలే దంపతుల ఆశయాలను కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకు వెళుతున్న విధానాన్ని వివరించారు. పట్టణ బిసి సెల్ అధ్యక్షులు ఫణిదపు దుర్గాప్రసాద్ మాట్లాడుతు పూనే లో జన్మించిన సావిత్రీ బాయ్ ని, జ్యోతీరావ్ పూలే అప్పటి సమాజ పరిస్థితుల కనుగుంగా బాల్య వివాహం చేసుకున్నా, ఆమె 18 సంవత్సరంలో, తొలి భారత దేశ మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమెను తీర్చిదిద్దారని, నాలుగు నెలల వ్యవధిలోని 20వరకు మహిళా విద్యాలయాలు ఏర్పాటు చేయగలిగారని, ఆదంపతులు ఆళయ సాధన కోసం శ్రమించిన తీరును వివరించారు. తెలుగు దేశం వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ముఖ్యమంత్రి గా, ఆడ పిల్లలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించినా, రాజకీయంగా మహిళలకు అవకాశాలు ఇచ్చారని, అదే బాటలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా డ్వాక్రా పొదుపు సంఘాల ద్వారా, పావలా వడ్డీ రుణాల ద్వారా ఇలా ఎన్నో అవకాశాలు మహిళకు చేరువ చేశాలని, అదే ఒరవడీ కూటమి ప్రభుత్వ ముఖ్య మంత్రిగా మహిళలకు అన్ని విధాలుగా అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు.

కార్య క్రమంలొ పట్టణ టిడిపి అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్, చాట్రగడ్డ ఆంజనేయులు, ముళ్ళపూడి వెంకట్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, పుట్టం పవన్, సుభాష్, తదితర బిసి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అంగలకుదురు సాయిబాబా సత్సంగ కేంద్ర వార్షికోత్సవం

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):మహామహిమాన్వితమైన సద్గురు సాయిబాబా, శరత్ బాబూజీల దివ్యాశీస్సులతో మూడు దశాబ్దాలుగా సాయిబాబా సత్సంగ కేంద్ర వార్షికోత్సవ ఆధ్యాత్మిక వేడుకలు ప్రతీ ఏటా వైభవంగా నిర్వహించుకుంటున్నామని సాయిబాబా సత్సంగ కేంద్ర బాధ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ప్రక్కన గల, శ్రీసాయిబాబా సత్సంగ కేంద్రం, 31వ, వార్షికోత్సవ ఆధ్యాత్మిక వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెనాలి కొత్తపేట సత్సంగ కేంద్రం నిర్వాహకులు, కృష్ణా మాస్టారి ఆధ్వర్యంలో, 1997 మార్చి లొ, అంగళకుదురు పంచాయతీ కార్యాలయం ప్రక్కన ప్రారంభమైన సత్సంగ కేంద్రంలో, ప్రతి మంగళవారం సాయంత్రం సత్సంగ సేవను కొనసాగిస్తారు. ప్రతి వార్షికోత్సవం గ్రామస్తులు, సాయిబాబా భక్తుల సహకారంతొ, కన్నుల పండువగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్నట్లు, గురు బందువు మీడియాకు తెలిపారు. సాయినామ సంకీర్తనలో వేలాది మంది భక్తులు సాయిబాబా నామం పలికారు. అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి వరకు విశేషమైన ఆధ్యాత్మిక సేవలు సత్సంగ కేంద్రంలో నిర్వహించనున్నట్లు గురు బంధువులు తెలిపారు. గ్రామంలోని సాయిభక్తులతొపాటు, తెనాలి, పరిసర ప్రాంత గురు బంధువులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు 5 రోజుల శిక్షణలో భాగంగా మిరపలో క్షేత్ర సందర్శన

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం, విజయవాడ ఆధ్వర్యం లో వ్యవసాయ అధికారులకు నిర్వహిస్తున్న 5 రోజుల మానవ వనరుల అభివృద్ధి శిక్షణ లో భాగంగా క్షేత్ర స్థాయిలో మిరప పంట లో " పంట పర్యావరణ విశ్లేషణ" ఎలా చేయాలో చూపించటం జరిగింది. దీని లో భాగంగా 40 మంది ట్రైనీ అధికారులను 5 బృందాలుగా విభజించి వారిచే మిరప పంటలో ఉన్న మిత్రపురుగులు, శత్రు పురుగులు, పంట పర్యావరణ పరిస్థితిని నమోదు చేసుకోవటం జరిగింది. తర్వాత ఒక్కొక్క బృందం వారు నమోదు చేసిన విషయాన్ని, విశ్లేషణ ను సహచర ట్రైనీలతో పంచుకొన్నారు. క్షేత్ర ప్రదర్శన లో పురుగు మందులు పిచికారి చేసే సమయం లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పి ఒక ట్రైనీ కి సురక్షిత దుస్తులు దరింపజేసి డెమో చూపించారు.

లాంఫారం లో ఉన్న జీవనీయంత్రణ ప్రయోగ శాలను ససందర్శించి ట్రైకోడర్మ విరిడి , సుడోమోనస్ ఫ్లోరెసెన్స్ అనే మేలుచేసే జీవ శిలీంద్రాన్ని ఎలా తయారు చేసుకోవాలో నేర్చుకున్నారు. తదుపరి మధ్యాహ్నం నుండి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, లాం ఫామ్ నుండి విచ్చేసిన డా. సాంబశివరావు గారు వరి లో సమగ్ర సస్య రక్షణ, తెగుళ్ల యాజమాన్యం గురించి ట్రైనీ అధికారులకు కూలంకుషం గా చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమం లో సి. ఐ. పి. ఎం. సి, విజయవాడ ఇంచార్జి మనోజ్ బురి గోస్వామి , శిక్షణా కార్యక్రమ కోఆర్డినేటర్ కే వి చౌదరి, అసిస్టెంట్ డైరెక్టర్ , సహాయ సస్య రక్షణ అధికారులు ఉదయశంకర్, మానస ,అనిల్ , కృష్ణ, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, ఎన్. టి. ఆర్. జిల్లాల నుండి వచ్చిన 40 మంది వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్‌లో ఉచిత మెగా మెడికెల్ క్యాంప్

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):కార్పొరేట్ సామాజిక బాధ్యత క్రింద లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్ గుంటూరు వారిచే చేపడుతున్న ఉచిత మెగా మెడికెల్ క్యాంపు లలో భాగంగా మంగళవారం సత్తెనపల్లి మండలంపాలడుగు గ్రామంలో నందు ఉ 9 గం నుండి సా 3 గం వరకు పాలడుగు కళ్యాణ మండపంలో ఉచిత మెగా మెడికెల్ క్యాంపు ను నిర్వహించారు. ఈ క్యాంపు ను షుమారు 400 మందికి పైగా ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని లలిత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. ఈ క్యాంపు ను కార్డియాలజీ, న్యూరాలజి, జనరల్ మెడిసిన్ విభగాల నందు నిర్వహించారు. ఈ క్యాంపు లో ఉచితంగా బిపి, షుగరు పరీక్షలు, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, కార్డియాలజీ కన్సల్టేషన్, న్యూరాలజి కన్సల్టేషన్, జనరల్ మెడిసిన్ కన్సల్టేషన్ సేవలను అందించి, గుండె, నరాలు సంబంధిత జబ్బులు గురించి అవగాహన కల్పించారు. రోగులకు సలహాలు – సూచనలు ఇచ్చారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ క్యాంపు లో డాక్టర్ నందిపాటి శ్రావ్య ,డాక్టర్ అఫ్నాన్ అబ్దుసలాం , డాక్టర్ పతంజలి , పాలడుగు గ్రామ పెద్దలు శాఖమూరి శివరామకృష్ణయ్య, శాఖమూరి కృష్ణారావు ,ఆమతి రమణ , లాలితా హాస్పిటల్ నర్సింగ్ స్టాఫ్, పారామెడికల్ స్టాఫ్, హాస్పిటల్ సిబ్బంది, లాలితా నర్సింగ్ కాలేజ్ స్టూడెంట్స్ మెదలగు వారు పాల్గొన్నారు.

జిల్లాలో వేసవి తీవ్రత నుండి ప్రజలను కాపాడాలి

○ తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

○ 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం

○ వేసవిలో కుక్క కాటు పెరిగే అవకాశం

○ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): వేసవి తీవ్రత జిల్లాల్లో గుంటూరు జిల్లా ఒకటని, వేసవి తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. వేసవి తీవ్రత పట్ల సంబంధిత అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రతీ శాఖలో నోడల్ అధికారిని నియమించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల, జిల్లా కార్యాలయాల్లోనూ చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జనకూడలి ప్రదేశాల్లోనూ, ఇతర అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడే గ్రామాలు గుర్తించాలని, అటువంటి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోర్లను 24 గంటలలో మరమ్మతులు పూర్తి చేయుటకు అవసరమైన విడి పరికరాలు సిద్ధంగా పెట్టాలని ఆదేశించారు. పశువులకు, వీధి కుక్కలకు కూడా తాగునీటిని లభ్యంగా ఉంచాలని సూచించారు. తాగునీటి లభ్యత ఉండకపోవడం వలన కుక్కకాటులు వేసవిలో ఎక్కువగా ఉంటుందని సర్వేలు సూచిస్తున్నాయని, తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో 0863 2234014 నంబరుకు తెలియజేయాలని చెప్పారు. విపత్తుల నిర్వహణ జిల్లా మేనేజర్ జిల్లా నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని, అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

వడ దెబ్బపై ప్రజల్లో అవగాహన అవసరం

వడ దెబ్బపై ప్రజల్లో అవగాహన అవసరమని, ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. వడ దెబ్బకు గురి కాకూడదని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాలని చెప్పారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పనులు ఉంటే మినహా ఎవరు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తాగాలని సూచించారు. చిన్నారులు, వయసు మీరినవారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు చూడాలని చెప్పారు. డీ హైడ్రేషన్ కు గురికాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నీడను కల్పించాలి

ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహన చోదకులు కొంత సేపు నిలువ వలసి ఉంటుందని, వారికి నీడను కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ వేతనదారులు, భవన నిర్మాణ కార్మికులు తీవ్రమైన ఎండలో పని చేయకుండా తగిన పర్యవేక్షణ చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ, కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని, మజ్జిగ వంటి ఏర్పాట్లు చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్. ఎస్. వి. రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, డి. ఎస్పీ బి. శ్రీనివాస రావు, ట్రాన్స్ కో పర్యవేక్షక ఇంజనీర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

కేరళం ఎన్నికలపై బీజేపీ ఫోకస్... అరణ్ములలో జయప్రకాశ్ వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

రెపరెపలాడుస్తుండడం సీపీఎం, కాంగ్రెస్ పార్టీలను కలవరానికి గురిచేస్తోంది.

వీణ జార్జ్‌పై ప్రజా చార్జ్‌షీట్...బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం : అక్కడి స్థానిక శాసనసభ్యురాలిగా గత రెండు దఫాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కమ్యూనిస్టు మంత్రి వీణ జార్జ్ గత దశాబ్ద కాలంగా నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని, ఆమె హయంలో నియోజకవర్గం పూర్తిగా వెనుకబాటుకు గురైందని ఆరోపిస్తూ, ఆమె వైఫల్యాలపై ప్రజా చార్జ్‌షీట్ వేయడం వంటి సంచలనాత్మక చర్యకు వల్లూరు జయప్రకాశ్ పూనుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారడంతో పాటు బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం తెచ్చింది. ఈ చర్యతో ప్రజల్లో బీజేపీ పట్ల సానుకూల దృక్పథం పెరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు.

'వికసిత్ కేరళం' నినాదంతో ప్రచారం : అరణ్ముల నియోజకవర్గం కేరళ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. గత కొన్నేళ్లుగా బీజేపీ కూడా ఇక్కడ తన బలాన్ని క్రమంగా పెంచుకుంటూ వస్తోంది. జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ, అరణ్ముల నియోజకవర్గంలో బీజేపీ 2021 ఎన్నికల్లో 18 శాతం ఓట్లు సాధించిందని, రానున్న ఎన్నికల్లో ఈ నియోజకవర్గం బీజేపీ కైవసం కావడం తథ్యమని జయప్రకాశ్ నారాయణ ఘంటాపథంగా చెబుతున్నారు. కేవలం ఈ ఒక్క నియోజకవర్గంలో మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ సత్తా చాటుతుందన్నారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వికసిత భారత్' లక్ష్యంతో కార్యాచరణ చేపట్టి భారతదేశాన్ని ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. మోదీ దేశవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో కూడా విశేష ఆదరణ కనిపిస్తోందని, ఈ ఎన్నికల్లో కేరళం రాష్ట్రంలో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించుకోవడం ద్వారా తమ రాష్ట్రం సైతం అభివృద్ధి, ఉపాధితో కళకళలాడి వికసిత కేరళంగా పరిమళిస్తుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. కేరళం రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై, బీజేపీపై ప్రజల్లో అచంచల విశ్వాసం కనిపిస్తోందని, వికసిత కేరళం కోసం ప్రజలు బీజేపీకి పట్టం కట్టబోతున్నారని, ఈ 2026 ఎన్నికల్లో కేరళలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని జయప్రకాశ్ నారాయణ స్పష్టం చేశారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఆదేశాలతో అరణ్ములలో పార్టీ స్థాయిని మరింత విస్తరించేందుకు జయప్రకాశ్ నారాయణ స్థానిక బీజేపీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు జయప్రకాశ్ అక్కడి పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలోని "వికసిత్ కేరళం" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు.

బూత్ స్థాయి వరకు వ్యూహం : 246 పోలింగ్ స్టేషన్లతో సుమారు రెండు లక్షల ముప్పై వేలకుపైగా ఓట్లు ఉన్న ఈ నియోజకవర్గంలో బూత్ వారీగా విస్తృత పర్యటనలు చేస్తూ, స్థానిక నేతలు ప్రతి ఒక్క ఓటరును స్వయంగా కలుసుకునే విధంగా శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు జయప్రకాశ్ నారాయణ. ఎన్నికల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వల్లూరు జయప్రకాశ్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. బూత్ కమిటీలు ఏర్పాటు చేయడం, యువతను పార్టీలోకి ఆకర్షించడం, సోషల్ మీడియా బృందాలను చురుకుగా మార్చడం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. "వికసిత్ కేరళం" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అవసరమైన ప్రణాళికను శక్తి కేంద్ర ప్రముఖులకు తెలియజేయడం, దానితో పాటు బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం వంటి కార్యాచరణను వేగంగా అమలు చేస్తున్నారు.

రైతు సమస్యలపై దృష్టి : 80 శాతానికి పైగా గ్రామీణ ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో రైతులు, రబ్బరు పంట సాగుదారుల సమస్యలు, రబ్బరు రైతుల ఆదాయం తగ్గడం, పాంపా నది వరద సమస్యలు, గ్రామీణ యువత వలస వెళ్లడం, రహదారి మరియు మౌలిక వసతుల అభివృద్ధి సమస్యలపై జయప్రకాశ్ నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామ పంచాయతీల వారీగా స్థానిక బీజేపీ నాయకత్వాన్ని ఏకతాటిపైకి తెచ్చి, వారితో విలేజ్ లెవెల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం ద్వారా వారు రైతులతో మమేకమై వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ అండగా ఉందని భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. రైతుల అభివృద్ధే వికసిత కేరళం, వికసిత భారత్ లక్ష్య సాధనకు మూలాధారమని, బీజేపీ రైతుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని ఈ విలేజ్ నెట్‌వర్క్ కమిటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న కార్యాచరణకు మంచి స్పందన లభిస్తోంది.

యువత వలసలపై ఆందోళన: సీపీఎం, కాంగ్రెస్ వైఖరి కారణంగా అరణ్ముల నియోజకవర్గంలో పెద్ద పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది యువత గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారని, ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాలు యువత భవిష్యత్తుపై శాపంగా మారాయని, బీజేపీకి అవకాశం ఇస్తే పెద్ద పరిశ్రమల ఏర్పాటుతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పనకు ప్రాధాన్యత దక్కుతుందని, యువత వలస ఆగాలంటే బీజేపీకి ఓటేసి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించాలని జయప్రకాశ్ నారాయణ స్థానిక బీజేపీ నేతలతో చేపట్టిన ప్రచారానికి యువతలో మంచి స్పందన కనిపిస్తోంది.

అలాగే నియోజకవర్గంలో ప్రధాన జీవనాధారమైన వ్యవసాయ సమస్యలపై కూడా బీజేపీ నేతలు ప్రధానంగా దృష్టి సారించేలా శ్రేణులను సంసిద్ధం చేశారు. రబ్బరు ధరలు పడిపోవడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వ్యవసాయానికి సరైన మద్దతు ధరలు, సదుపాయాలు కల్పన, గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాల మెరుగుదల, పాంపా నది పరివాహక ప్రాంతాల్లో తరచుగా ఉత్పన్నమవుతున్న వరద నివారణకు చర్యలపై బీజేపీ హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళు_న్నారు జయప్రకాశ్ నారాయణ.

ఆలయ పర్యాటక అభివృద్ధిపై హామీ : అరణ్ముల ప్రాంతం ఆలయ సంప్రదాయాలు మరియు సాంస్కృతిక ప్రాధాన్యంతో ప్రసిద్ధి పొందింది. ముఖ్యంగా అరణ్ముల పార్థసారథి దేవాలయం మరియు అరణ్ముల బోట్ రేస్ వంటి అంశాలు పర్యాటక ఆకర్షణలుగా ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో హిందూ ఓటర్లు 55-60% ఉన్నట్లు అంచనా.

అయితే హిందూ సంస్కృతి, హిందూ ఆలయాలపై ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ నిర్లక్ష్య, వివక్షపూరిత వైఖరి కారణంగా ఈ ప్రాంతంలో ఆలయ పర్యాటక అభివృద్ధి జరగలేదని వల్లూరు జయప్రకాశ్‌తో పాటు స్థానిక బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే సరైన ప్రణాళికతో ఆలయ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు గణనీయంగా మెరుగుపరుస్తామని జయప్రకాశ్ నారాయణ, బీజేపీ శ్రేణుల ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ హయంలో ఆలయ సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణపై తీవ్ర వివక్ష కొనసాగిందని, ఆలయాల పరిరక్షణ, ఆలయాల నిర్వహణ కేవలం బీజేపీతోనే సాధ్యమనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తున్నారు జయప్రకాశ్ నారాయణ.

ప్రభావవంతమైన ప్రాంతాలపై వ్యూహాత్మక కార్యాచరణ : అరణ్ముల నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలపై ప్రత్యేక ప్రభావం చూపే ప్రాంతాలైన అరణ్ముల ప్రాంతం, కొజెన్చ్రేరీ పరిసరాలు, ఎలంతోర్ ప్రాంతం, మల్లపుజస్సేరి గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించిన జయప్రకాశ్ నారాయణ అక్కడి స్థానిక బీజేపీ నేతలు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ ఈ ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణకు సమాయత్తం అవుతున్నారు.

కీలక సామాజిక వర్గాలపై ప్రత్యేక ఫోకస్ : ఈ నియోజకవర్గంలో రాజకీయంగా ప్రభావవంతంగా ఉన్న నాయర్ సమాజం, ఎజవా వర్గం, షెడ్యూల్డ్ కులాలు, సిరియన్ క్రైస్తవ రైతులు వంటి కీలక సామాజిక వర్గాలపై ప్రధానంగా దృష్టి సారించి ఆ వర్గాల సంపూర్ణ మద్దతు సాధించేందుకు స్థానిక బీజేపీ నేతలతో కార్యాచరణ రూపొందిస్తున్నారు జయప్రకాశ్ నారాయణ.

ఇక 30-35% శాతంగా ఉన్న క్రైస్తవ ఓటర్ల మద్దతు పొందేందుకు క్రైస్తవ మత పెద్దలతో భేటీలు నిర్వహిస్తూ, బీజేపీ భావజాలాన్ని, ప్రధాని మోదీ నిర్దేశించుకున్న వికసిత కేరళం, వికసిత భారత్ లక్ష్యాలను, అందుకు ప్రధాన మంత్రి మోదీ చేపడుతున్న కార్యాచరణను వివరిస్తూ కేరళం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, వికసిత కేరళం అభివృద్ధి కోసం బీజేపీకి మద్దతు ఇవ్వాలని క్రైస్తవ మత పెద్దలకు జయప్రకాశ్ నారాయణ వివరిస్తున్నారు.

అదే విధంగా షెడ్యూల్డ్ కులాల ఓటర్లు సుమారు 15% వరకు ప్రభావం చూపే అవకాశమున్నందున ఆ వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రధానమంత్రి చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ఆ వర్గాలలోకి తీసుకువెళ్లి, షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి కృషి చేసే ఏకైక పార్టీ బీజేపీ అనే వాస్తవాన్ని వివరించేందుకు బీజేపీ శ్రేణులతో కార్యాచరణ రూపొందిస్తున్నారు.

సవాళ్ల మధ్య వ్యూహంతో ముందుకు... : అరణ్ములలో బీజేపీకి కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. సంప్రదాయంగా ఎల్‌డీఎఫ్--యూడీఎఫ్ మధ్య పోటీ, మైనారిటీ ఓటర్ల సమీకరణ, వామపక్ష పార్టీల బలమైన కేడర్ వ్యవస్థ వంటివి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. అయితే ఈ పరిస్థితుల్లో కూడా వ్యూహాత్మకంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి వల్లూరు జయప్రకాశ్ నారాయణ కృషి చేస్తున్నారు.

కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జయప్రకాశ్ నారాయణ చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

అరణ్ములలో బీజేపీ ఓటు శాతం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో సరైన వ్యూహంతో ముందుకు సాగితే పార్టీకి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో వల్లూరు జయప్రకాశ్ నారాయణ చేపడుతున్న కార్యాచరణ పార్టీకి బలాన్నిచ్చే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు.

త్రాగునీటి సరఫరా, పైపులైన్ల మరమ్మతులపై కమిషనర్‌కు బీజేపీ వినతి

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో గుంటూరు నగరంలో త్రాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా నాయకులు గుంటూరు నగర మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో నాయకులు కమిషనర్‌ను కలిసి నగరంలోని కొన్ని కాలనీలలో పగిలిపోయిన పైపులైన్లను వెంటనే మరమ్మతులు చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచి శుద్ధ త్రాగునీటిని నగర ప్రజలకు తగినంతగా సరఫరా చేయాలని కోరారు. అలాగే నగరంలో పెరుగుతున్న వీధి కుక్కల దాడులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ అంశాలపై తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అనంతరం నగర మేయర్ కోవెలమూడి నానీని కలిసి నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్తూరి సుబ్బారావు, జూపూడి రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసరావు, దేసు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మేరీ సరోజినీ, సాధు రామకృష్ణ, లక్ష్మీనారాయణ శర్మ, కార్యదర్శులు నారాయణరెడ్డి, సురేష్ జైన్, ఏపీ ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్ గౌడ్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ సాంబశివరావు, మండల అధ్యక్షులు సేగు నరేష్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌కు సత్కారం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్‌ను గుంటూరులో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి, ది రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు డివిజన్ అధ్యక్షుడు క్రిష్టిపాటి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

ఈ సందర్భంగా శాలువాతో అభినందనలు తెలియజేసి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ హౌసింగ్ రంగంలో చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. నారాయణ రెడ్డి, సెక్రటరీ ఎల్. రాఘవ బాబు, జి. సుధాకర్ రావు, దేవరాజ్, పి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మాన ఎందుకు పెట్టినట్లు?

- సభా చర్చలో మాట్లాడిన.తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత ఎంపీ లావు
- ప్రజల దృష్టి మళ్లించడానికి ప్రయత్నం

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): ప్రజల దృష్టి మళ్లించేందుకు, గందరగోల వాతావరణాన్ని సృష్టించేందుకే ప్రతిపక్షాలు లోక్ సభస్పీకర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టాయని తెదేపా లోక్ సభ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు విమర్శించారు. పార్లమెంటులో లోక్‌సభస్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్ష పార్టీలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై లావు శ్రీకృష్ణదేవరాయలు మంగళవారం సభలో మాట్లాడారు.

స్పీకర్ గా ఓం బిర్లా వ్యవహార శైలి ఎన్నో ఏళ్లుగా చూస్తున్నాం. ఆయన సభను సజావుగా, హుందాతనంగా నడిపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, త్రిపుల్ తలాక్ బిల్లు, న్యాయ సమ్మిట్ వంటి దేశతీరును మార్చే ఎన్నో కీలకమైన బిల్లులు మద్దతతో వారి హయాంలో ఆమోదం పొందినవే అని చెప్పారు. సమయపాల, విలువలతో సభను నడపడంలో, మాట్లాడేందుకు అందరికీ సమయం ఇవ్వటంలో ఓం బిర్లా నిబద్ధతతో పని చేశారు. క్లిష్టమైన కోవిడ్ సమయంలో కూడా తగు జాగ్రత్తలు వహించేలా పకడ్బందీగా సభ జరగటంలో ఆయన చొరవ చూపారు. 17వ లోక్ సభ 97 శాతం ప్రొడక్టివిటీ రేటు పొందటంలో ఓం బిర్లా ప్రమేయానికి, పనితనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. అసలు స్పీకర్ పై ప్రతిపక్షాలు అవిశ్వాసం తీర్మానం ఎందుకు పెట్టాయో తెలియని పరిస్థితి.. ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం చర్చించేందుకు సిద్ధంగా ఉంది. కానీ, సభ లోపల, బయట కూడా ఇబ్బంది పెట్టేలా ప్రతిపక్ష సభ్యుల వైఖరి ఉంది. కేవలం గందరగోళ వాతావరణాన్ని సృష్టించేందుకే వారు ప్రయత్నిస్తున్నారు. ఇది ముందుకు పోయే పరిస్థితి లేదు. ప్రజలు ఇది గమనిస్తూనే ఉన్నారు. వారు ఎన్నికల్లో ఓడిపోయిన బాధలో ఇదంతా చేస్తున్నారా? అన్నట్లు అనిపిస్తుంది.

మరొక విషయం ఏమిటంటే.. ప్రతిపక్షాల వారు నిత్యం గాంధీజీ, అంబేద్కర్ గారి గురించి మాట్లాడుతున్నారు. వారు దేశంలో మహోన్నత వ్యక్తులుగా నిలిచిన వారు. మహాత్మా గాంధీజీ సత్యం, అహింస మార్గాల్లో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారు, అంబేద్కర్ గారు రాజ్యాంగాన్ని రూపొందించి దేశాన్ని సన్మార్గంలో నడిపించారు, అలాంటి వారి ఆశయాలకు అనుగుణంగా వారి బాటలో ప్రతిపక్షాలు నడుచుకోవాలని కోరుతున్నాను.

చరిత్రలో బ్లాక్ డే గా నిలిచిపోయే సంఘటన అప్పటి అధికార కాంగ్రెస్ హయాంలోనే ఒకటి జరిగింది, అదే ఆంధ్ర రాష్ట్ర అనైతిక విభజన. అప్పటి రాష్ట్ర అసెంబ్లీ వ్యతిరేకించిన ఆంధ్ర రాష్ట్ర విభజన బిల్లును పార్లమెంట్ సాక్షిగా.. అప్పటి అధికార కాంగ్రెస్.. లోక్ సభలోని అన్ని తలుపులను మూసి, లైవ్ టెలికాస్ట్ ని గంటల తరబడి ఆపి మరి అన్యాయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించి, బిల్లుని పాస్ చేశారు. ఇప్పుడేమో రాజ్యాంగం విలువలు, స్పీకర్ తీరు గురించి కాంగ్రెస్ మాట్లాడడం విడ్డూరంగా విచిత్రంగా అనిపిస్తుంది. 2014 ఫిబ్రవరి 14వ తేదీని బ్లాక్ డేగా నిర్ణయించి దీనిపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని, సభలో చర్చ జరగాలని ఎంపీ కృష్ణదేవరాయలు ఉద్ఘాటించారు.

15న ఉల్లాస్ అక్షర ఆంధ్రా పరీక్ష

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): ఉల్లాస్ అక్షర ఆంధ్రా అభ్యర్థులకు ఈ నెల 15వ తేదీన పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 1485కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు తమకు అవకాశం ఉన్న సమయంలో వచ్చి పరీక్షలు రాయవచ్చని తెలిపారు. పరీక్షను రెండు గంటల పాటు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ పరీక్షలు 150 మార్కులకు ఉంటుందని అందులో 50 మార్కులు చదవడానికి, 50 మార్కులు రాయడానికి, 50 మార్కులు అంకెల పరిజ్ఞానంపై ఉంటుందన్నారు. ఒక్కో విభాగంలో 17 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత పొందుతారని చెప్పారు. నాలుగు రోజుల పాటు మంచి తర్ఫీదు అందించి శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని కోరారు. వయోజన విద్యా డిప్యూటీ డైరక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో 90,426 మంది నమోదు అయ్యారని, 9,043 మంది వాలంటీర్లు బోధిస్తున్నారని వివరించారు.

ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలనే ధ్యేయంతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి కృష్ణ, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు లోచర్ల రమేష్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఐదేళ్ల పాలనలో 9.70 లక్షల కోట్ల అప్పులు



- ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ విమర్శ
- అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు వడ్డీలు కడుతున్న కూటమి ప్రభుత్వం
- అధికారం నుంచి దిగిపోయే మూడు నెలల కాలంలో రూ.27,025 కోట్ల మేర అప్పులు చేసిన జగన్

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): జగన్ ఐదేళ్ల పరిపాలనలో లెక్కుకు మించి చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం ఇప్పుడు వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి దాపరించిందని, జగన్ పాలనలో రూ. 9.70 లక్షల కోట్ల మేర అప్పులు చేసి ఏమాత్రం ఆదాయ వనరులపై దృష్టిపెట్టకుండా కేవలం బటన్ నొక్కడమే పనిగా ఐదేళ్ళ కాలయాపన చేశారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మంగళవారం. ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా కూటమి ప్రభుత్వంపై ఏటా రూ. 71,800 కోట్ల భారం పడుతోందని, వైసీపీ నిర్వాకంతో బ్యాంకులు సైతం అప్పులు ఇవ్వడం మానేశాయని అన్నారు. తాను చేసిన అప్పుల బురదను కూటమి ప్రభుత్వంపై వేయాలని జగన్‌రెడ్డి ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం కాగ్ నివేదికపై వైసీపీ, సాక్షి మీడియా తప్పుడు రాతలు రాయడం మానుకోవాలని మన్నవ మోహనకృష్ణ పత్రికా ప్రకటనలో హితవు పలికారు.

"వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో సుమారు రూ. 9.70 లక్షల కోట్లు అప్పు చేశారు. ఆ అప్పు కూటమి ప్రభుత్వం చేసినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 81వేల కోట్లు ప్రభుత్వం అప్పు తీసుకుందని కాగ్ నివేదిక ఇస్తే.. వైసీపీ రూ. 87 వేల కోట్లుగా ప్రచారం చేస్తుంది. ఆ ఏడాదిలో వైసీపీ మూడు నెలలు అధికారంలో ఉంది. తొలి మూడు నెలల్లో రూ. 27,025కోట్లు అప్పు చేసింది. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లో రూ. 53వేల కోట్లు అప్పు చేసింది. సాధారణ పరిపాలనకు సైతం ఖజానాలో నిధులు లేకుండా చేసిన ఘనుడు జగన్.

కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 20 వేల కోట్లు చెల్లించింది. వైసీపీ హయంలో ఐదేళ్లలో అమ్మఒడి పథకానికి రూ. 26వేల కోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్లు కోసం జగన్ రూ. 58,500 కోట్లు ఖర్చు చేస్తే.. కేవలం ఇరవై నెలల్లోనే రూ. 58,654 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. రైతులకు జగన్ ఐదేళ్లలో రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తే.. ఒక్క సంవత్సరంలో రూ. 6300కోట్లు ఇచ్చాం. గతంతో పోల్చితే 45శాతం వరకు అదనపు నిధులు ఇస్తున్నాం. కేంద్ర పథకాలైనా అమృత్, జల్ జీవన్ మిషన్ పథకాలకు రాష్ట్రం నుంచి డబ్బులు ఇవ్వకుండా వాటిని వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఒక దిశానిర్దేశం లేని పథకాలను అమలు చేసి ప్రజలను మోసం చేశాడు జగన్.

పంచాయతీ గ్రాంట్స్, కేంద్ర ప్రభుత్వ పథకాలను జగన్ పక్కదారి పట్టించారు. తన హయంలో సర్పంచ్‌ల అధికారాలు తీసి ఇంట్లో కూర్చొబెట్టారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఇప్పుడు అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాడు. జగన్ హయంలో రాష్ట్రానికి ఒక్క పెట్టుబడైనా వచ్చిందా? సాక్షి పత్రిక, టీవీలో నచ్చిన వారిని కూర్చొబెట్టి అసత్య వార్తలను ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు. చివరికి అన్నం పెట్టే రైతులను మోసం చేసిన చరిత్ర జగన్మోహన్‌రెడ్డిది. బాధ్యత రహితంగా వ్యవహరించి రైతులకు రూ. 1600 కోట్లు చెల్లించకుండా వెళ్లిపోయారు. వైసీపీ హయంలో ధాన్యం అమ్మిన ఆరు నెలలు వరకు డబ్బులు జమ అయ్యేవి కావు. నేడు 24 గంటల్లో రైతు అకౌంట్‌లో డబ్బులు జమా చేస్తున్నాం. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను నాశనం చేశాడు. చింతలపూడి, వెలిగొండ ప్రాజెక్టులను పూర్తి చేస్తే లక్షల రైతులు బాగుపడేవారు.

వైసీపీ పాలనలో పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారు. ఇప్పుడు చంద్రబాబు సారథ్యంలో పరిశ్రమలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయి. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. 20 నెలల్లో 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగింది. భారతి సిమెంట్ రేటును రూ. 3 పెంచి ప్రజలపై రూ. 165 కోట్ల భారం మోపింది. ప్రకటనల ద్వారా సాక్షి మీడియాకు సుమారు రూ. 400 కోట్ల లబ్ధి చేకూర్చారు. సాక్షి, భారతి సిమెంట్స్‌కు మాత్రమే ఆదాయం వచ్చేలా జగన్ కృషి చేసి రాష్ట్రాన్ని గాలికొదిలేశారు. " అని మోహనకృష్ణ నిప్పులు చెరిగారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467